# సంపాదకీయం

## మార్క్ జుకర్ బర్గ్.. వేల కోట్ల ఖర్చుతో భూగర్భ బంకర్ అందుకేనా?

ఫేస్ బుక్, ఇన్‌స్ట్రాగామ్ సంస్థల అధినేత మార్క్ జుకర్ బర్గ్ ఏం చేసినా సంచలనమే. 30 ఏళ్ల వయసులోపే ఆయన ఫేస్ బుక్ ను బిలియన్ డాలర్ల సంస్థగా నిలిపారు. అంతేకాకుండా అత్యధిక ధనవంతుల జాబితాలోనూ నిలిచారు. ఇక ఇన్‌స్ట్రాగామ్ ద్వారా జుకర్ బర్గ్ మరిన్ని సంచనాలకు తెర తీశారు. తాజాగా మార్క్ జుకర్ బర్గ్ తీసుకున్న నిర్ణయం హాట్ టాపిక్ గా మారింది. వేల కోట్ల రూపాయల ఖర్చుతో ఆయన భూగర్భ బంకర్ ను నిర్మిస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. వివరాల్లోకి వెళ్తే మెటా సీఈవో మార్క్ జుకర్ బర్గ్, అతని భార్య ప్రిసిల్లా చాన్ తమ కోసం భూగర్భ బంకర్ ను నిర్మించాలని తలపెట్టారు. ఇందుకోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. భారత కరెన్సీలో 2,249 కోట్ల రూపాయల భారీ ఖర్చుతో దీన్ని నిర్మిస్తుండటం విశేషం. ఈ 5 వేల చదరపు అడుగుల బంకర్ ను అమెరికాలోని హవాయిలో ఉన్న జుకర్ బర్గ్ 1400 ఎకరాల పొలంలో నిర్మిస్తున్నారు. కాగా ఈ బంకర్ కి బయట ప్రపంచం నుంచి అవసరం ఏమీ ఉండదని అంటున్నారు. దానంతట అదిగా సొంత శక్తిని సమకూర్చుకునేలా నిర్మిస్తున్నారు. బంకర్ గేట్ ఒక లోహంతో, కాంక్రీటుతో నింప బడి ఉంటుందని అంటున్నారు. సాధారణంగా ఇలాంటి బంకర్లను క్షిపణి దాడులు, అణు వార్ హెడ్లు, శక్తివంతమైన బాంబుదాడులు, తీవ్రమైన తుపానుల నుంచి తప్పించుకోవడానికి వాడతారని పేర్కొంటున్నారు. కాగా ఈ బంకర్ ను మార్క్ జుకర్ బర్గ్ ఎందుకు నిర్మిస్తున్నారో.. దీనికి వేల కోట్ల రూపాయల ఖర్చు ఎందుకు పెడుతున్నారో ఇంతవరకు ఆయన కానీ, ఆయన కంపెనీల తరఫున మరెవరైనా కానీ చెప్పలేదు. కాగా ఈ బంకర్ లో అండర్ గ్రౌండ్ షెల్టర్ ఉంటుంది. బంకరులోనే డజనుకు పైగా భవనాలు నిర్మిస్తున్నారు. ఇందులో పనిచేసేవారు ఇక్కడే నివాసం ఉంటారు. బంకర్ లో ఏకంగా 30 బెడ్ రూమ్‌లు, 30 బాత్ రూమ్‌లు ఉంటాయి. ఇవి కాకుండా రెండు బంగ్లాలను కూడా నిర్మించారు. ఈ బంకర్ కు చెందిన బ్లూ ప్రింట్‌లో 11 ట్రీ హౌస్‌లు, ఫిట్‌నెస్ సెంటర్, గెస్ట్ హౌస్, అనేక ఇతర నిర్మాణాలు ఉండటం విశేషం. కాగా ఇలాంటి బంకర్ల నిర్మాణానికి గతంలో పలువురు ముందుకొచ్చారు. ప్రముఖ వెంచర్ క్యాపిటలిస్ట్ పీటర్ థీల్ కూడా గతేడాది బంకర్ ను నిర్మించుకోవాలని అనుకోగా.. స్థానిక కౌన్సిల్ ఆ ప్లాన్ ను అంగీకరించలేదు. బంకర్ నిర్మాణంతో చుట్టుపక్కల పర్యావరణం దెబ్బతింటుందని అభ్యంతరం వ్యక్తం చేసింది. అలాగే అమెరికా ధనవంతుల్లో ఒకరిగా ఉన్న డూమ్‌డే కూడా మార్క్ జుకర్ బర్గ్ లాగే బంకరును నిర్మించారు.

## సమాజ అభివృద్ధికి కార్పొరేట్ వ్యవహారాలు సజావుగా సాగడం ఎంతో అవసరం




శామీర్ పేట (గరుడ వార్త) : కార్పొరేట్ వ్యవహారాలు ప్రజా అనుకూల ంగా సాగాలని హైదరాబాద్ లోని సిసిఆర్టి చైర్మన్ సి ఎస్ ఆర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం శామీర్ పేట లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ కృష్ణదేవరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ కార్పొరేట్ గవర్నెన్స్ రీసెర్చ్ కార్పొరేట్ లాస్ అండ్ గవర్నెన్స్ డెవలప్ మెంట్స్ అండ్ ట్రెండ్స్ అనే అంశంపై మూడు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సును, సి సి ఆర్ టి శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెంకటరమణ విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ వంటి వ్యవహారాలలో సామాజిక చట్టాలు పారదర్శకంగా, సజావుగా సాగాలని చెప్పారు. ఎన్ ఎల్ యు జోద్ పూర్ వైస్ ఛాన్సలర్ హర్ ప్రీత్ కౌర్ కార్పొరేట్ వ్యవహారాలు సామాజిక చట్టాలపై కీలక ప్రసంగం చేశారు. ఈ సదస్సులో మొదటి రోజు పలువురు వీసీలు, ప్రొఫెసర్లు కార్పొరేట్ చట్టాలు, భద్రత చట్టాలు, వివిధ అంశాలపై ప్రసంగాలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ న్యాయ విశ్వవిద్యాలయాల, కళాశాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

## అలియాబాద్ గ్రామంలో రాజకీయాలకు అతీతంగా అయోధ్య రామయ్య అక్షింతల కలశ శోభయాత్ర



శామీర్ పేట (గరుడ వార్త): అలియాబాద్ గ్రామంలో రాజకీయా లకతీతంగా గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు అయోధ్య రామయ్య అక్షింతల శోభాయాత్ర లో పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నా రు. శామీర్ పేట మండలంలోని అలియాబాద్ గ్రామంలో అయోధ్య శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో వచ్చిన పూజిత అక్షింతల శోభాయాత్ర కార్యక్రమం శుక్రవారం అలియాబాద్ గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయం నుండి శ్రీరాముని ఊరేగింపు ప్రధాన విధుల్లో నుండి గాంధీ నగర్ లోని సేవ బస్తీ శ్రీరాముని అక్షింతలు ప్రతి గడప గడపకు వితరణ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గర్కా.కుమార్ యాదవ్,మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి,గాదె వెంకటేష్,చిటుకుల సత్యం, హరిశంకర్, ఎం.యాదగిరి, ఏం మహేష్, శ్రీశైలం యాదవ్, యు భిక్షపతి, బి శివ, టి నందు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజేందర్ నగర్ పోలీస్ స్టేషన్ దేశంలోనే ఉత్తం పోలీస్ స్టేషన్ గా ఎంపికైనందుకు సిఐను అభినందించిన డిజిపి రవి గుప్తా



సైబరాబాద్ క్రైమ్ (గరుడ వార్త) : దేశంలోనే ఉత్తమ పోలీస్ స్టేషన్ గా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఎంపిక అవడంతో, రాజేంద్రనగర్ సిఐని డీజీపీ రవి గుప్తా, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మొహంతి అభినందించారు.

దేశంలోనే రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఉత్తమ పోలీస్ స్టేషన్ 2023గా అవార్డు సాధించడంతో మరోమారు తెలంగాణ పోలీస్ పనితీరు యావత్ భారతదేశానికి చెప్పకనే చెప్పిందని డిఐజి అభిప్రాయపడ్డారు. ఈ ఉత్తమ ప్రతిభ పురస్కారాన్ని మినిస్ట్రీ ఆఫ్ హెూమ్ అఫైర్స్ వారు నిర్వహించగా, ట్రోఫిని కేంద్ర హెూమ్ మినిస్టర్ అమిత్ షా అందజేశారు.

## ఎమ్మెల్యేను కలిసిన ప్రజా ప్రతినిధులు, నాయకులు



శామీర్ పేట (గరుడ వార్త) : మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కి ప్రజా ప్రతినిధులు, నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మూడు చింతలపల్లి సర్పంచ్ జాం రవి, ఉమ్మడి శామీర్ పేట మండలం బీఆర్ఎస్ నాయకులు వనం దాస్ మురళి గౌడ్, వేణు గౌడ్, కృష్ణారెడ్డి, రామలింగారెడ్డిలు మల్లారెడ్డి ని శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బొమ్మ రాసిపేట్ సర్పంచ్ గీతా మహేందర్లు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి దంపతులను శాలువాతో సత్కరించి పుష్పగుచ్చమంద చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నీ తన క్యాంపు



కార్యాలయంలో టీఆర్ఎస్ నాయకుడు వంగ వెంకట్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## మానేరు పర్యాటకుల నిట్టూర్పు

సిరిసిల్ల : మానేరు తీరాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దడంలో యంత్రాంగం విఫలమవుతోంది. ఇక్కడ కొంత మేరకు సౌకర్యాలు తీసుకొచ్చినా, ఉపయోగించకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయి. నిర్వహణ, పర్యవేక్షణ వ్యవస్థ లేకుండా పోయింది. ఈ సారైతే సందర్శకులు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సెలవు దినాల్లో ఆహ్లాదం కోసం వచ్చేవారికి నిట్టూర్పే మిగులుతుంది. గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఎగువమానేరు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. దాదాపు 70 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ జలాశయం నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. ఇది నిండిన సమయంలో పర్యాటకులు వచ్చి వీక్షిస్తారు. మూడు చోట్ల నుంచి ఉన్న దారుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గుబురుగా మారిన చెట్ల పొదలతో ఈ ప్రాంతం అడవిని తలపిస్తోంది. జలకళ వచ్చినపుడు మత్తడి దూకుతున్న సమయంలో పర్యాటకులు సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఇక్కడికి వచ్చినవారికి కనీస సౌకర్యాలు లేకపోవడం శోచనీయం. కట్టపైకి వెళ్లి సేదతీరే పరిస్థితి లేదు.

### పడవలున్నా... నిర్వహణ సున్నా

మూడేళ్ల క్రితం ఎగువమానేరులోకి ఒక లాంచీ, రెండు పెట్రో బోట్లు



తీసుకొచ్చారు. కరోనా మహమ్మారితో ఎలాంటి కదలికలు లేకుండా పోయాయి. రెండేళ్ల క్రితం పెట్రో బోట్లను సిరిసిల్లకు తరలించారు. లాంచీ వినియోగం, నిర్వహణను మరిచిపోయారు. ఈ బాధ్యతలను పర్యాటకశాఖకు అప్పగించారు. వారు పట్టించుకోకపోవడంతో చుట్టూ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. సెలవు రోజుల్లో ఇక్కడికి పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కనీస సౌకర్యాలు కూడా లేవు. ఇటు సిరిసిల్ల, రాజరాజేశ్వర జలాశయంలోనూ పెద్ద పడవలు, పెట్రో బోట్లు ఉన్నా నిర్వహణ లేదు. రాజరాజేశ్వర జలాశయం వద్ద పర్యాటకుల సందడి లేకుండా పోయింది.

పర్యవేక్షణ లేకనే...ఎగువ మానేరు జలాశయాన్ని తిలకించేందుకు మూడు వ్యూపాయింట్లు ఉన్నాయి. ఇక్కడికి వెళ్లేందుకు సరైన మార్గం లేదు. చుట్టూ అటవీ ప్రాంతాన్ని తలపించడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. మానేరు తీరంలో భద్రతా వ్యవస్థ సక్రమంగా లేదని పలువురు ఆరోపిస్తున్నారు. డ్యాంలోని నీటిలో ప్రమాదవశాత్తు పడి మరణించిన వారు కొందరు కాగా అనుమానాస్పద స్థితిలోని మృతదేహాలు లభ్యమైన సంఘటనలు కూడా ఉన్నాయి. పర్యాటక ప్రాంతం అభివృద్ధి చేసి నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. జలాశయం కింద లోలెవల్ కాజ్‌వేలు శిథిలమై వరదలకు కొట్టుకుపోయాయి. వీటికి కనీస మరమ్మతులు లేవు. దీంతో ఇటు నర్మాల, కోళ్లమద్ది గ్రామాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులను కాపలా పెట్టారు. ఎలాంటి వాహనాలు వెళ్లే అవకాశం లేదు. జలాశయం వద్దకు వచ్చే పర్యాటకుల భద్రతాపరమైన చర్యలు తీసుకోలేని పరిస్థితిలోనే బారికేడ్లతో మూసివేశారు.

## చుక్ చుక్ బండి.. అంతటా ఆగదండి!

పెద్దపల్లి : కరీంనగర్ నుంచి పెద్దపల్లి మీదుగా మంచిర్యాలకు రహదారి మార్గంలో వెళ్తే సుమారు 84 కిలోమీటర్ల దూరానికి రెండు గంటలకు పైగా ప్రయాణించాలి. అదే రైలులో పెద్దపల్లి నుంచి మంచిర్యాలకు అర గంటలోపే చేరుకోవచ్చు. దీంతో చాలా మంది కరీంనగర్ నుంచి పెద్దపల్లి వరకు బస్సులో వచ్చి అక్కడి నుంచి అందుబాటులో ఉండే ఎక్స్‌ప్రెస్ గాని, ప్యాసింజర్ రైలు గాని ఎక్కితే మొత్తమ్మీద గంటన్నరలోనే మంచిర్యాల చేరుకోవచ్చు. అయితే ఇదంతా గతం.. దాదాపు రెండున్నరేళ్ల కిందట కరోనా వచ్చిన తర్వాత రైళ్ల వేళలన్నీ మారాయి. హాల్టింగ్, పాత మార్గాలను రద్దు చేయడంతో రైలు ప్రయాణం ప్రహసనంగా మారింది.

50 ఏళ్లుగా నడిచిన నాగ్‌పూర్(అజ్ని) ప్యాసింజర్ రైలును రెండేళ్ల కిందట కొవిడ్ ప్రభావంతో అధికారులు రద్దు చేశారు. తాజాగా ఆగస్టు 1 నుంచి ఈ రైలును నడిపించాలని నిర్ణయించారు. అయితే కాజీపేట నుంచి బల్లార్షా వరకు మాత్రమే ఎక్స్‌ప్రెస్ రైలుగా నడిపించనున్నారు. ప్రతి రోజూ రాత్రి 10.50కి కాజీపేట జంక్షన్‌లో బయల్దేరి పెద్దపల్లికి 11.41, రామగుండానికి 11.54 వరకు చేరుకుంటుంది. మరుసటి రోజు తెల్లవారుజామున బల్లార్షా జంక్షన్‌కు 3.10కి చేరుతుంది. తిరిగి ఇదే ఎక్స్‌ప్రెస్ ఉదయం 3.50కి బల్లార్షా నుంచి రామగుండానికి ఉదయం 5.47కి, పెద్దపల్లికి 6.15కు వచ్చి, కాజీపేటకు ఉదయం 8.50కి చేరుకుంటుంది. ఇంతవరకు బాగానే ఉన్నా గతంలో కాజీపేట నుంచి నాగ్‌పూర్(అజ్ని) వరకు నడిపిన ఈ ప్యాసింజర్‌ను ఎక్స్‌ప్రెస్‌గా మార్చడంతో పాటు బల్లార్షా వరకు మాత్రమే నడిపించాలని నిర్ణయించారు. అంతే కాకుండా పదుల సంఖ్యలోని స్టేషన్‌లలో హాల్టింగ్‌లను ఎత్తివేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### బస్సు ప్రయాణం.. భారమే!

నిత్యం కరీంనగర్, నిజామాబాద్‌ల నుంచి మంచిర్యాల, బల్లార్షాలకు వెళ్లే ఉపాధ్యాయులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు, సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలు సాధారణంగా రైలు ప్రయాణాన్నే ఎంచుకుంటారు. ఈ మార్గంలో బస్సులో వెళ్లాలంటే గంటల తరబడి ప్రయాణానికి ఒళ్లు హూనం కావాల్సిందే. అస్తవ్యస్తంగా రహదారులు, ట్రాఫిక్ రద్దీతో రోజులో సగం సమయం ప్రయాణానికే కేటాయించాల్సి వస్తోంది. ఇటీవలి కాలంలో పెరిగిన బస్సు ఛార్జీలతో ఆర్థిక భారం కూడా మామూలుగా లేదు. అదే రైలు ప్రయాణమైతే ఎక్కువలో ఎక్కువగా జనరల్ టికెట్‌కు రూ.150 లోపే ఉంటుంది. బస్సులో వెళ్తే గమ్య స్థానాలను బట్టి రూ.200కు పైగా వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా బస్సులు సమయపాలన పాటించడం లేదు. నిత్యం గోదావరిఖని, మంథని, పెద్దపల్లి, కరీంనగర్‌ల నుంచి మంచిర్యాలకు వెళ్లే బస్సులు కిటకిటలాడుతూ ఉంటాయి.

ఇక మంచిర్యాల జిల్లా పరిధిలో మంచిర్యాల, బెల్లంపల్లి స్టేషన్లలో మాత్రమే రైలును నిలపనున్నారు. దీంతో సింగరేణి, ఇతర సంస్థల ఉద్యోగులు, ఇతరులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గతంలో రవీంద్రఖని(రామకృష్ణాపూర్), మందమర్రి పట్టణాల్లో హాల్టింగ్ ఉండగా, తాజాగా దాన్ని ఎత్తివేశారు. 14 స్టేషన్లకు తగ్గిన హాల్టింగ్ కరీంనగర్ జిల్లా పరిధిలో జమ్మికుంట, పెద్దపల్లి జిల్లా పరిధిలో పొత్కపల్లి, పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వే స్టేషన్లలో మాత్రమే హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. అజ్ని ప్యాసింజర్‌గా కొనసాగిన కాలంలో సింగరేణీయులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు కాజీపేట నుంచి పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల మీదుగా మహారాష్ట్ర వరకు ఇందులోనే ప్రయాణించేవారు. గతంలో 60 స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం ఉన్న ఈ రైలును ఎక్స్‌ప్రెస్‌గా మార్చడంతో పాటు కేవలం 14 స్టేషన్లలోనే నిలుపుదలకు నిర్ణయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# అక్కడి వారిక్కడ.. ఇక్కడి వారక్కడ

హైదరాబాద్: రాజధానిలో భారీగా డీసీపీలకు స్థానభ్రంశం కలిగింది. వారం కిందట ఉత్తర మండలం డీసీపీ జోయల్ డేవిస్‌ను హైదరాబాద్ ఎస్బీకి పంపిన ప్రభుత్వం తాజాగా జోగులాంబ(జోన్-7) డీఐజీగా పంపింది. ఇటీవల రాచకొండ ఎస్బీ నుంచి సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీగా వెళ్లిన బి.బాలస్వామి మెదక్ ఎస్పీ అయ్యారు.

వారందరికీ స్థానచలనం: గతేడాది జనవరిలో మూడు కమిషనరేట్లలో డీసీపీ స్థాయి అధికారుల్ని అప్పటి ప్రభుత్వం బదిలీ చేసింది. ఇప్పుడు వారినే ఇతర జోన్లకు మార్చింది. రాష్ట్ర మహిళా భద్రత విభాగం ఎస్పీగా ఉన్న పీవీ పద్మజ మల్కాజిగిరి డీసీపీగా నియమితులయ్యారు. అదే స్థానంలో ఉన్న జానకి ధరావత్ సౌత్‌ఈస్ట్ జోన్‌కు మారారు. మాదాపూర్ డీసీపీగా డాక్టర్ జి.వినీత్ వచ్చారు. కొన్నినెలల కిందట సైబరాబాద్ మహిళా రక్షణ విభాగం నుంచి హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా వెళ్లిన నితికా పంత్ కొద్దిరోజుల్లోనే బదిలీ అయ్యారు. ఇప్పుడు ఆమెకు మేడ్చల్ డీసీపీగా బాధ్యతలు అప్పగించారు. రాచకొండ సైబర్‌క్రైమ్ డీసీపీ బి.అనురాధ సిద్దిపేట కమిషనర్‌గా వెళ్తారు. 2017 బ్యాచ్‌కు చెందిన సీహెచ్.ప్రవీణ్‌కుమార్ ఎల్బీనగర్ డీసీపీగా, ఇక్కడి నుంచి సాయిశ్రీ ఈస్ట్‌జోన్ డీసీపీగా బదిలీ అయ్యారు. ఇటీవల



సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీగా వచ్చిన బిరుదురాజు రోహిత్‌రాజు మళ్లీ బదిలీ అయ్యారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆర్.వెంకటేశ్వర్లుకు హైదరాబాద్ ట్రాఫిక్-3 బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఇదే స్థానంలో ఉన్న ఎన్.వెంకటేశ్వర్లు పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టరుగా వెళ్లారు. మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనివాస్ రాజేంద్రనగర్ డీసీపీగా మారారు.

నార్కోటిక్ కంట్రోల్ బ్యూరోలు: సైబరాబాద్ యాంటీ నార్కోటిక్ సెల్ డీసీపీగా భాస్కర్ అగ్గడి, రాచకొండకు కరుణాకర్ పుల్లా నియమితులయ్యారు. రాచకొండ ట్రాఫిక్ డీసీపీ మనోహర్, సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీగా కొత్తపల్లి నర్సింహ, మహిళా విభాగం డీసీపీగా సృజన కరణం, మేడ్చల్ ఎస్‌వోటీ డీసీపీగా శ్రీనివాస్, మహేశ్వరం డీసీపీగా సునీతారెడ్డి, హైదరాబాద్ అడ్మిన్ డీసీపీ శిల్పవల్లి సైబర్‌క్రైమ్ విభాగానికి మారారు. మేడ్చల్ అదనపు డీసీపీ మహ్మద్ ఇక్బాల్ సిద్ధిఖీని హైదరాబాద్ అడ్మిన్ అదనపు డీసీపీగా ప్రభుత్వం మార్చింది.

# హెచ్ఎండీఏ లేఅవుట్

హైదరాబాద్: హెచ్ఎండీఏ ప్రాజెక్టులకు నిధుల గండం వెంటాడుతోంది. రహదారుల నిర్మాణం, లేఅవుట్ల అభివృద్ధి కుంటుపడ్డాయి. భారాస ప్రభుత్వ హయాంలో భూముల వేలం ద్వారా రూ.వేల కోట్లు హెచ్ఎండీఏకు ఖాతాలోకి చేరాయి. వాటిని ఆ ప్రభుత్వం అప్పటి అవసరాల కోసం వాడుకుంది. కనీసం లేఅవుట్లలో మౌలిక వసతులకు అవసరమైన నిధులను పక్కన పెట్టక పోవడంతోనే ప్రస్తుత పరిస్థితికి కారణమనే విమర్శలున్నాయి. ఇలా 7 జిల్లాల పరిధిలో పలు లేఅవుట్లలో వసతులు కల్పించకపోవడంతో స్థలాలు కొనుక్కున్న వారు ప్రస్తుతం హెచ్ఎండీఏ చుట్టూ తిరుగుతున్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష తర్వాత ఈ పనుల్లో కదలిక వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలంటున్నాయి.

కీలక ప్రాజెక్టులివే..నార్సింగి-శంకర్‌పల్లి రోడ్డుకు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న మోకిలలో 165 ఎకరాల్లో హెచ్ఎండీఏ లేఅవుట్ ఉంది. గజం ధర రూ.లక్షపైనే పలికింది. కనీస ధర రూ.72 వేలకు విడతల వారీగా ప్లాట్లను విక్రయించారు. 300-600 చ.గజాలు విక్రయించగా భారీగా ఆదాయం సమకూరినా ప్రస్తుతం ఈ లేఅవుట్ అభివృద్ధికి నిధుల్లేవు. రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థకు రూ.100 కోట్లు అవసరమవుతాయి.

వరంగల్ జాతీయ రహదారికి అరకిలోమీటర్ల దూరంలో 55 ఎకరాల్లో హెచ్ఎండీఏ లేఅవుట్ తీర్చిదిద్దింది. అదేవిధంగా మియాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి గండిమైసమ్మ వైపు వెళ్లే మార్గంలో బాచుపల్లిలో కూడా 27 ఎకరాల్లో ప్లాట్లుగా చేసి విక్రయించారు. ఏడాది గడుస్తున్నా మౌలిక వసతులు కల్పించక పోవడంతో ప్లాట్లు కొన్నవారు లబోదిబోమంటున్నారు.వాస్తవానికి తొలుత లేఅవుట్ అభివృద్ధి చేసిన తర్వాతే ప్లాట్లు



విక్రయించాలి. కానీ హెచ్ఎండీఏ మాత్రం ఈ నిబంధనలు తుంగలో తొక్కింది. తొలుత ప్లాట్లు విక్రయించిన తర్వాతే మౌలిక వసతులు కల్పిస్తామంటూ 18 నెలల గడువు విధిస్తోంది. గతేడాది మే, ఏప్రిల్ నెలల్లో విక్రయించిన లేఅవుట్లలో ఇంతవరకు వసతులు కల్పించకుండా తాత్సారం చేస్తోంది.

మియాపూర్ నుంచి గండిమైసమ్మ 14 కిలోమీటర్ల రహదారి వెడల్పు, అభివృద్ధికి రూ.100 కోట్లతో టెండర్లు పిలిచారు. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ఈ రహదారి అభివృద్ధి కీలకం. అయితే నిధుల కొరతతో టెండర్లు దశ దాటలేదు.కొత్వాల్‌గూడలోని ఎకో పార్కును రూ.300 కోట్లతో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నారు. వివిధ రకాల పక్షుల కోసం ప్రత్యేక గ్యాలరీలు, పీపీపీ పద్ధతిలో అండర్ టన్నెల్ అక్వేరియం నిర్మించాలని యోచించారు. దీనికీ నిధుల సమస్య వెంటాడుతోంది. అక్వేరియానికి టెండర్లు పిలిచినా స్పందన రాలేదు. ఇలా 20-25 పనులు నిలిచిపోయాయి.

# ఆసుపత్రి స్థాయి పెంచి.. వసతుల కల్పన మరచి!




ఎల్లారెడ్డిపేట: పల్లె జీవనం సాగించే పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఎల్లారెడ్డిపేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాల కల్పనపై నిర్లక్ష్యం నెలకొంది. గతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా స్థాయిని పెంచినప్పటికీ అందుకు అనుగుణంగా వసతుల కల్పనకు నోచుకోలేదు. దీంతో పీహెచ్‌సీ సిబ్బందితోనే దవాఖానాను నెట్టుకురావాల్సిన దుస్థితి నెలకొంది.

ఆదరణ ఉన్నా.. అరకొర సిబ్బందే ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాలు కలుపుకొని మొత్తం 41 గ్రామాల్లో సుమారు 61,958 జనాభా ఉన్నారు. ఈ రెండు మండలాల ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 2022 సెప్టెంబరులో సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)గా మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జనాభా, మారుమూల గ్రామాలు, గిరిజన తండాలు అత్యధికంగా ఉన్న దృష్ట్యా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డీహెచ్) కింద ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచారు.

సూపరింటెండెంట్‌గా డాక్టర్ బాబు (జనరల్ మెడిసిన్)తోపాటు ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులను నియమించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేసే ఇద్దరు నర్సులు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టు, ఒక ఎన్‌సీడీ స్టాఫ్‌నర్సు సేవలను సీహెచ్‌సీకి వినియోగించుకుంటున్నారు. వీరితోపాటు పొరుగు సేవలపై అయిదుగురు శానిటేషన్ సిబ్బంది, ముగ్గురు సెక్యూరిటీ సిబ్బంది, ముగ్గురు పేషెంట్ కేర్ సిబ్బందిని నియమించారు. ఇన్‌పేషెంట్లకు ఆహారం సమకూర్చుతున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోగుల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నా అరకొర సిబ్బందితో ఇబ్బందులు తప్పడం లేదు. రోజూ దాదాపు వంద నుంచి 120 ఓపీ నమోదవుతోంది. నెలలో 30కి పైగా జనరల్ కేసులు, 15 నుంచి 20 ఆరోగ్యశ్రీ కేసులు వస్తున్నాయి. అసంక్రమిత వ్యాధులు (ఎన్‌సీడీ చికిత్సలు), గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. నెలలో సగటున 1,590 టీ హబ్ రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఆసుపత్రి పరిధిలో గతేడాది నవంబరులో 105 మలేరియా నిర్ధారణ, 85 డెంగీ, 90 ఇతర రోగ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. కుక్క, కోతి కాటులకు చికిత్స అందిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం, కలెక్టర్ ప్రత్యేక చొరవతో ప్రస్తుతం చిన్నపాటి మందుల గది, వంట గది, మూత్రశాలల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

పక్కా భవన నిర్మాణమెప్పుడో?

సీహెచ్‌సీని పూర్తిస్థాయిలో నిర్వహించాలంటే పక్కా భవనాన్ని నిర్మించడంతోపాటు ఆధునిక వైద్య పరికరాలు, వైద్య నిపుణలను ఏర్పాటు చేయాల్సి ఉంది. భవన నిర్మాణానికి ఇటీవల మండల కేంద్రం శివారులో కేటాయించిన స్థలం వివాదంలో చిక్కుకుంది. ఆరు పడకల ఆసుపత్రి 30 పడకల ఆసుపత్రిగా పేరు మారిందే తప్పా అందుకు తగిన సౌకర్యాల కల్పన ఊసేలేదు. సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహించాలంటే నలుగురు ఎంబీబీఎస్ డాక్టర్లు, సర్జన్, గైనకాలజిస్టు, అనస్తీషియా, పిల్లల వైద్యుడు, దంత వైద్యుడు తదితర ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు అందుబాటులోకి రావాల్సి ఉంది. వీటితోపాటు పోస్టుమార్టం, ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేసులు) సేవలు సైతం అందాల్సి ఉంది. అన్ని వసతులతో కూడిన ఆసుపత్రి భవనాలను నిర్మించి, అధునాతన వైద్య పరికరాలను సమకూర్చాల్సి ఉంది.

ప్రభుత్వానికి నివేదించాంఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి పక్కా భవనం, వైద్య నిపుణులు, సిబ్బంది కోసం గతంలోనే ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతం ఉన్న వైద్యులు, సిబ్బందితోనే ఆసుపత్రిని నిర్వహిస్తున్నాం. పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది కేటాయింపు జరగాల్సి ఉంది. ఈ విషయాన్ని మరొకసారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.మురళీధర్‌రావు, డీసీహెచ్ఎస్, సిరిసిల్ల

# గ్రామీణ వైద్యం.. మరింత పటిష్టం

కొత్తగూడెం: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలందించటమే లక్ష్యంగా వైద్యారోగ్యశాఖను ప్రక్షాళన చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితులను సమీక్షించటంతో పాటు అంతరాలను గుర్తించి సేవలు మెరుగుపరిచేలా మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. ప్రాథమిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈనేపథ్యంలో గిరిజనులు ఎక్కువగా నివసించే భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని మారుమూల పల్లెల్లో మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి.

పల్లె దవాఖానాలపై ప్రత్యేక దృష్టి

గ్రామాల్లో వైద్యసేవలను మెరుగుపరచటానికి గత ప్రభుత్వం భద్రాద్రి జిల్లాలో 153, ఖమ్మం జిల్లాలో 161 పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసింది. ఒక్కో పల్లె దవాఖానాకు ఎంబీబీఎస్ డాక్టర్, ల్యాబ్‌టెక్నీషియన్, ఏఎన్ఎంలను కేటాయించింది. ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో లేనిచోట స్టాఫ్‌నర్స్‌లను నియమించింది. సాధారణ జ్వరాలు, నొప్పులు, రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధిగ్రస్థులకు చికిత్స అందించాలని నిర్దేశించింది. ఇటీవల స్టాఫ్ నర్సుల నియామకాలు చేపట్టినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. తాజాగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో పల్లె దవాఖానాలకు ప్రాధాన్యమివ్వాలని, వాటిలో మెరుగైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని వైద్యారోగ్య శాఖ మంత్రి అధికారులను ఆదేశించారు.

పల్లె దవాఖానాలను ప్రభుత్వం బలోపేతం చేయాలని నిర్ణయించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ సిబ్బంది కొరతను అధిగమించేందుకు నియామక ప్రక్రియకు పూనుకుంది. తద్వారా గ్రామీణ వైద్యసేవలు మెరుగుపడనున్నాయి.

శిరీష, డీఎంహెచ్ఓ, భద్రాద్రి కొత్తగూడెం

సర్దుబాటు చేయాలి.. సరిదిద్దాలి ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యసేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. మౌలిక వసతుల కొరతతో వైద్యులు ఇక్కడ విధులు నిర్వర్తించటానికి ఆసక్తి చూపటం లేదు. డిప్యుటేషన్‌పై కేటాయించిన ప్రాంతాలకు వెళ్లకుండా పట్టణాల్లోని ఆసుపత్రుల్లో ఉండేందుకే మొగ్గుచూపుతున్నారు. వైద్యం అవసరమైన చోట తక్కువ మంది.. వైద్యసేవలు మెరుగ్గా ఉన్నచోట ఎక్కువ మంది వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. మారుమూల గ్రామాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే వైద్యులు అక్కడా పనిచేసేందుకు ఆసక్తి కనబరుస్తారని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొన్నిచోట్ల స్త్రీ వైద్యనిపుణులు లేక గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ స్త్రీ వైద్యనిపుణులను నియమించాలని గ్రామీణులు కోరుతున్నారు. మరికొన్నిచోట్ల ల్యాబ్ టెక్నీషియన్లు లేకపోవడంతో చిన్నపాటి వ్యాధుల నిర్ధారణకూ జిల్లా కేంద్రాల్లోని సర్వజనాసుపత్రులకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

# పొదుపు చేస్తేనే ఇంధనం



గోదావరిఖని : పెరుగుతున్న వాహనాలు.. రవాణా అవసరాలకు అనుగుణంగా ఇంధన వినియోగం నానాటికీ పెరుగుతోంది. పొదుపు విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల సహజ వనరులు అంతరించి పోయే దశకు చేరుకుంటున్నాయి. మార్కెట్‌లోకి చాలా వరకు ఇటీవల డీజిల్, పెట్రోలుతో అవసరం లేకుండా విద్యుత్తుతో నడిచే వాహనాలు అందుబాటులోకి వస్తున్నాయి. దీని వల్ల కొంత మేరకు ఇంధనాన్ని పొదుపు చేసే అవకాశం ఏర్పడింది. నేటినుంచి ప్రారంభం కానున్న ఇంధన పొదుపు వారోత్సవాల నేపథ్యంలో ప్రత్యేక కథనం.

ప్రజా రవాణాలో..

ప్రయాణికులను చేరవేసే ఆర్టీసీ సంస్థ కొంత వరకు పొదుపు అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 11 ఆర్టీసీ డిపోల్లో 861 బస్సులు నడుస్తున్నాయి. ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు చేరవేసే ఆర్టీసీ సంస్థ ప్రతి సంవత్సరం పక్కాగా ఇంధన పొదుపుపై అవగాహన కల్పిస్తోంది. ఇంధనాన్ని పొదుపుగా వినియోగించే బస్సు డ్రైవర్లను ప్రోత్సహిస్తోంది. ప్రత్యేకంగా అవార్డులు సైతం అందజేస్తోంది. ఆయా డిపోలకు రివార్డులను సైతం ప్రకటిస్తోంది. ప్రతినెలా డిపో పరిధిలో ఇద్దరికి, ప్రతి మూడు నెలలకు రీజియన్ పరిధిలో ఇద్దరు చొప్పున డ్రైవర్లను ఎంపిక చేసి సత్కరిస్తుంది. ఈ క్రమంలోనే 2020-21 సంవత్సరంలో మెట్‌పల్లి డిపోనకు ఇంధన పొదుపు అవార్డు దక్కింది.

ఇవి పాటిస్తేనే మేలు..

ప్రతి ఒక్కరు తాము నడిపే వాహన కండీషన్‌ను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి

అవసరం లేని చోట ఇంజిన్‌ను ఆన్‌లో ఉంచకూడదు

ప్రయాణించాలనుకున్నపుడే వాహనాన్ని స్టార్ట్ చేయాలి

ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ఇంజిన్‌ను ఆఫ్ చేయాలి

తాము వినియోగించే వాహనం లీటరుకు ఎన్ని కిలోమీటర్ల మైలేజీ ఇస్తుంది. కంపెనీ ఇచ్చిన కండీషన్ పరిధిలో ఉందా అన్న విషయాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి.

వాహన టైర్ల విషయంలో సైతం జాగ్రత్తలు తీసుకోవాలి. అందులో లోపాలున్నా ఇంధన వినియోగం ఎక్కువగా ఉంటుంది.

వాహనాన్ని పరిమిత వేగంతో నడపం వల్ల ఇంధనం తక్కువ ఖర్చవుతుంది.

వీలైనంత వరకు ప్రజారవాణా వ్యవస్థపై ఆధారపడటం వల్ల వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించవచ్చు.

చిన్నచిన్న అవసరాలకు, కొద్దిపాటి దూరానికి సైతం వాహనాన్ని వినియోగించడం నేటికాలంలో పరిపాటిగా మారింది. దీనిని నియంత్రించుకోవాలి.

ఇంటివద్ద ప్రతీ అవసరానికి ద్విచక్ర వాహనాన్ని వినియోగించే బదులు సైకిల్, నడక ద్వారా వెళితే మెరుగైన ఆరోగ్యం మన సొంతమవుతుంది. ఇంధనాన్ని సైతం పొదుపు చేసినవారమవుతాం.

నైపుణ్యం అవసరం

ఎండీ ముజీబ్‌పాషా, కరీంనగర్ 1 డిపో డ్రైవర్

బస్సు నడిపే సమయంలో నైపుణ్యం అవసరం. అదుపు లేని వేగంతో వెళితే ఇంధనం ఎక్కువగా ఖర్చవుతుంది. ఒకే వేగంతో నడపడం వల్ల ఇంధనం ఆదా చేసుకునే అవకాశం ఉంటుంది. నాకు మూడుసార్లు ఇంధన పొదుపు అవార్డు లభించింది. రీజియన్, డిపో స్థాయిలో ఇంధన పొదుపు అవార్డుకు ఎంపికయ్యాను. 150 లీటర్ల డీజిల్‌ను పొదుపు చేశాను. బస్సును నడిపే సమయంలో అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని నడపడం వల్ల డీజిల్ పొదుపు సాధ్యమవుతుంది.

వేగ పరిమితి మించకూడదు

చంద్రశేఖర్‌గౌడ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్

వాహనాన్ని పరిమితికి మించి వేగంగా నడపడం వల్ల ఇంధన వినియోగం పెరుగుతుంది. ప్రతి వాహనదారుడు దీనిని గమనించాలి. రహదారి ఉన్న పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటూ వాహనాలను నడపాలి. ఇంధనాన్ని పొదుపుగా వాడకుంటే రానున్న కాలంలో చాలా కష్టాలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా వాహనాలు పెరుగుతున్నాయి. అందుకు అనుగుణంగా సరిపడా ఇంధనం సమకూర్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

మూడు సార్లు అవార్డు

కరీంనగర్ 1 డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న చిగురు లక్ష్మయ్య ఇంధన పొదుపులో మూడుసార్లు అవార్డు తీసుకున్నారు. రోలర్ అవార్డుతో రూ. 50 వేల నగదు పారితోషికం పొందారు. గత జులై నుంచి సెప్టెంబరు వరకు ఆయన రీజియన్ స్థాయిలో అవార్డు దక్కించుకున్నారు. ఇతర డ్రైవర్ల కంటే ఎంతో నియంత్రణతో బస్సులు నడిపి 380 లీటర్ల డీజిల్‌ను ఆదా చేశారు. రోడ్డుపై వెళ్లే సమయంలో పరిమిత వేగంతో పాటు రహదారి ఉన్న పరిస్థితికి అనుగుణంగా వాహనం నడపడం వల్లే ఇంధనాన్ని పొదుపు చేయగలిగానని లక్ష్మయ్య చెబుతున్నారు.

# కన్నుపడితే కబ్జా

సిద్దిపేట : జిల్లాలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు.. నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కట్టడి చేయాల్సిన రెవెన్యూ యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిజాలను నిగ్గు తేల్చి.. కొరడా ఝుళిపించాల్సింది పోయి చిన్నపాటి చర్యలతో చేతులు దులిపేసుకుంటున్నారు. జిల్లా కేంద్రం సహా పట్టణాల్లో అనేక చోట్ల ఈ విషయం రూఢీ అవుతోంది. నిబంధనలు కాలరాస్తూ పలువురు నిర్మాణాలు చేపడుతున్నా.. ఉన్నతాధికారులు నామమాత్రం గా వ్యవహరిస్తున్నారు. రక్షణ చర్యలు లేక పలువురు యథేచ్ఛగా ఆక్రమణలు చేస్తున్నారు.

ఇక్కడ మామూలే..!సిద్దిపేటలో మొన్నటికి మొన్న ఓ నిర్మాణ విషయం వెలుగులోకి వచ్చినా.. తాత్కాలిక చర్యలతో సరిపెట్టుకున్నారు. తాజాగా సర్వే నం.1301 సంబంధిత దక్కలి కాలనీలో ఓ ఇంటి నిర్మాణం రెండు రోజులుగా శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో పలువురు ఇదే తరహాలో నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. పట్టణంలో సర్వే నం.1340, 1301లలో ప్రభుత్వ భూమి కనుమరుగవుతున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడం గమనార్హం. సిద్దిపేట అర్బన్ తహసీల్ కార్యాలయానికి సమీపంలోని ప్రాంతాల్లోనే ఈ తతంగం జరగటం గమనార్హం. అక్రమాలను అడ్డుకోవాల్సింది పోయి వారికి సహకరిస్తున్నారనే ఆరోపణలు పెరిగాయి. రూ.లక్షల విలువైన భూముల్లో ఒకర్ని చూసి మరొకరు పాగా వేస్తున్న తీరు సిద్దిపేటలో చర్చనీయాంశంగా మారింది. ఆరంభంలోనే తగిన చర్యలతో కట్టడి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

వక్ఫ్‌బోర్డు స్థలాలు ఖతమ్..

గజ్వేల్ పట్టణంలోని జాలిగామ రోడ్డులో వక్ఫ్‌బోర్డు స్థలాల ఆక్రమణ జోరుగా సాగుతోంది. ఏళ్లుగా ఈ తంతు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పర్యవేక్షణ లేమితో ఒకప్పుడు వందల ఎకరాల్లో ఉన్న స్థలం.. నేడు పదుల ఎకరాలకు చేరింది. రాజకీయ ఒత్తిళ్లు, మామూళ్ల మత్తులో కొందరు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఒకవేళ వెలుగులోకి వచ్చినా.. నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. ఇలాగే పోతే మరికొన్ని రోజుల్లో వక్ఫ్ బోర్డు స్థలాలు కనుమరుగవడం ఖాయమని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

లోపాయికారి వ్యవహారం..

హుస్నాబాద్ పురపాలక సంఘం పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇళ్ల నిర్మాణాల అనుమతులు ఆన్‌లైన్ ద్వారా పొందుతున్నప్పటికీ జరుగుతున్న పనులు వేరే విధంగా ఉంటున్నాయి. సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించడం లేదు. అక్కన్నపేట, నాగారం రోడ్లలో అక్రమ నిర్మాణాలు జరిగాయని జిల్లా అధికారులకు గతంలో ఫిర్యాదు అందినా చర్యలు శూన్యం. మరోవైపు పట్టణ ప్రణాళిక విభాగంలో సరిపడా సిబ్బంది లేరు. అక్రమంగా చేపట్టిన నిర్మాణాలకు పురపాలిక సంఘం తరఫున ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారు. ఇదే క్రమంలో ప్రభుత్వ నిబంధనల మేరకే సదరు నిర్మాణాలకు రెట్టింపు ఇంటి పన్నులు విధిస్తున్నట్లు చెబుతున్నారు.మట్టి పోసి ఆక్రమణ..స్థిరాస్తి వ్యాపారులు చెరువులు, కుంటలే లక్ష్యంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. నీటి వనరుల పక్కనున్న పట్టా భూములను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. వాటి శిఖంతో పాటు బఫర్‌జోన్(నీటి ఊట ప్రాంతం)లోకి చొరబడి మట్టితో నింపి, ఆక్రమిస్తున్నారు. కొన్నాళ్ల తర్వాత వాటిని ప్లాట్లుగా చేసి విక్రయించడం, లేదా నిర్మాణాలు చేసిన తర్వాత అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి కబ్జాలు చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో కొనసాగుతు న్నాయి. చేర్యాల పట్టణాన్ని ఆనుకొని ఉన్న కుడిచెరువును కొందరు అక్రమ నిర్మాణాలతో పూడ్చివేస్తున్నారు. గతంలో జిల్లా పాలనాధికారి ఆదేశాలతో స్థానిక నీటిపారుదల, రెవెన్యూ అధికారులు చెరువు బఫర్‌జోన్ అంచున కందకం తీయించారు.

# దాగుడు గుంతల దండాకోర్

ఖమ్మం : చింతకాని మండలం జగన్నాథపురం సమీపంలో రహదారి కోతకు గురైంది. ఇదే ప్రాంతంలో గుంతలు ఉండటంతో వాటిని తప్పించే క్రమంలో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.బోనకల్లు నుంచి ముష్టికుంట్ల నడుమ, నాగులవంచ నుంచి జగన్నాథపురం, పందిళ్లపల్లి వరకు రహదారి ప్రమాదకరంగా మారింది. ఈమార్గం గుండా నిత్యం వేలాది వాహనాలు విజయవాడ, జగ్గయ్యపేట ఇతర ప్రాంతాలకు వెళ్తుంటాయి.వైరా మండలం స్టేజీపినపాక వద్ద వంతెన ప్రమాదాలకు నెలవుగా తయారైంది. ఖమ్మం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే జాతీయ రహదారి కావటంతో వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఖమ్మం నుంచి సత్తుపల్లి, భద్రాచలం వెళ్లే వాహనాలతో ఈప్రాంతం రద్దీగా ఉంటుంది. వారధిపై రోడ్డు సైతం గుంతలమయం కావటంతో వాహనాలు కుదుపునకు గురైనప్పుడు ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. వంతెనపై గుంతలకు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయిస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కార మార్గం చూపటం లేదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.వైరా నుంచి తల్లాడ వరకు పలుచోట్ల గుంతలు ఏర్పడి రహదారి ప్రమాదకరంగా మారింది.

అమాత్యులకు విన్నపాలుతమ ఇక్కట్లను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిగణనలోకి తీసుకొని రహదారులను మెరుగుపరచాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రయోగ విద్య.. అంతంతే!



జగిత్యాల: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయించింది. సైన్స్ విద్యార్థుల ప్రయోగ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో అత్యధికశాతం ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ప్రయోగాలు అంతంతమాత్రంగానే కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 15 ప్రభుత్వ, 35 ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. సైన్స్ విభాగంలో ప్రభుత్వ విద్యార్థులు 1000 మంది ప్రైవేటు విద్యార్థులు 5 వేల మంది ఉన్నారు. చాలావరకు కళాశాలల్లో ప్రయోగాలకు సంబంధించి సిలబస్ పూర్తికాలేదు. కళాశాలల్లో బోధన, సదుపాయాల నేపథ్యంలో ప్రతి రోజు ప్రయోగాలకు కేటాయించాల్సిన సమయం సరిపోవడం లేదని యాజమాన్యాలు చెబుతున్నాయి. కొన్ని కళాశాలల్లో గదుల కొరత, సామగ్రి లేకపోవడం, రసాయనాలు లేక విద్యార్థులు ప్రయోగ విద్యకు దూరమవుతున్నారు. ప్రైవేటు కళాశాలల్లో ప్రయోగశాలలున్నా సిలబస్ నామమాత్రంగానే పూర్తయింది.

సమస్యను నివేదించాం..

ప్రయోగశాలలకు సంబంధించి రసాయనాలను పంపాలని విద్యాశాఖ కమిషనర్‌ను కోరడం జరిగింది. ఇటీవల నిర్వహించిన సమావేశంలోనూ ఇదే అంశంపై సమస్యను వివరించాం. ప్రయోగ పరీక్షలకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. ఇదివరకే చాలా కళాశాలల్లో సిలబస్ కూడా పూర్తి చేశాం.

రసాయనాల కొరత

రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరంలో 29 మంది, బైపీసీలో 18 మంది విద్యార్థులు, రెండో సంవత్సరంలో ఎంపీసీలో 24 మంది, బైపీసీలో 16 మంది విద్యార్థులు ఉన్నారు. రెండో సంవత్సర విద్యార్థులకు ప్రయోగాలు ప్రారంభమైనా రసాయన శాస్త్రానికి సంబంధించి రసాయనాల కొరత ఉంది. ఫిబ్రవరిలో రెండో సంవత్సరం విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉండగా 15 రోజుల క్రితం రసాయనాల కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. కళాశాల ఆవరణలో కోతల బెడద తీవ్రంగా ఉంది. కింది స్థాయి సిబ్బంది పహారా మధ్య ప్రయోగాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది.

తరగతి గదిలోనే...

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రయోగ తరగతులు అంతంతమాత్రంగానే కొనసాగుతున్నాయి. ఇక్కడ కళాశాలలో సాధారణ విభాగం, వృత్తి విద్యా, ఉర్దూ మాధ్యమం కూడా ఉండటంతో బోధనకు సరిపడా గదులు లేవు. ఉన్నవాటినే సర్దుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో ప్రయోగ తరగతుల కోసం ప్రత్యేక గది లేకపోవడంతో బోధన తరగతి గదినే ప్రయోగశాలగా మార్చారు. ప్రయోగాలకు సంబంధించిన సిలబస్ 80 శాతం పూర్తయింది. 100 మంది వరకు సైన్స్ విద్యార్థులున్నా సరిపడా రసాయనాల సరఫరా లేదు. ఉన్నవాటితోనే ప్రయోగాలు చేపడుతున్నారు. ప్రయోగ పరీక్షలు సమీపిస్తుండటంతో రసాయనాల కోసం కళాశాల యాజమాన్యం ప్రతిపాదనలు పంపారు.

పురాతన భవనాల్లోనే..

ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చాలీచాలని వసతుల మధ్య ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. పురాతన గదుల్లో ఇన్నాళ్లు ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. శిథిలమైన రెండు గదులను కూల్చి వేయగా, మరో రెండింటిలోనే ప్రయోగాలు ఏర్పాటు చేస్తున్నారు. పాత పరికరాలతోనే ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. ఇంటర్‌లో మొదటి సంవత్సరం 109, రెండో సంవత్సరం 121 మంది విద్యార్థులున్నారు. బోటనీ, జువాలజీ ఒక చోట, ఫిజిక్స్, కెమెస్ట్రీలు మరో చోట నిర్వహిస్తున్నారు. గదుల తలుపులను ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు పగుల గొట్టగా, కళాశాల సిబ్బంది సొంతంగా డబ్బులు సమకూర్చుకుని మరమ్మతు చేసుకున్నారు. ప్రిన్సిపల్ రమేష్ మాట్లాడుతూ ఉన్న గదుల్లోనే విద్యార్థులకు ప్రయోగ తరగతులు నిర్వహిస్తున్నామని, నూతన పరికరాల కోసం ప్రతిపాదనలను పంపించినట్లు వివరించారు.

పాత పరికరాలే దిక్కు

కోరుట్ల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో తెలుగు, ఆంగ్ల, ఉర్దూ మీడియంలో ఎంపీపీ, బైపీసీ విభాగాల్లో మొత్తం 202 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 50 ఏళ్ల క్రితం నిర్మించిన భవనంలో సైన్స్‌ల్యాబ్‌లు ఉన్నాయి. గదుల గోడలు, పైకప్పు పూర్తిగా దెబ్బతినడంతో ఎప్పుడు కూలుతాయో తెలియకుండా మారాయి. ల్యాబ్‌లలో చాలా వరకు పాత పరికరాలు ఉన్నాయి. కొన్నేళ్లుగా సైన్స్‌ల్యాబ్‌ల నిర్వహణకు ప్రభుత్వం ఎలాంటి నిధులను కేటాయించడం లేదు. దీంతో రసాయనాలు, ఇతర సైన్స్ పరికరాలు కొనుగోలు చేయడం లేదు. ఉన్నవాటితోనే అధ్యాపకులు నామామాత్రంగా విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్నారు.

## ఉపాధ్యాయులు.. విద్యార్థుల ఉన్నతి అంతంతే

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు అభ్యసన నైపుణ్యాలు పెంచేందుకు విద్యాశాఖ ప్రవేశపెట్టిన 'ఉన్నతి' కార్యక్రమం ఆశించిన ఫలితాలు ఇవ్వడంలేదు. ప్రతి పాఠశాలలో విద్యార్థులను చదివించడం, రాయించడం వంటి కృత్యాలను ఉపాధ్యాయులు చేయిస్తున్నా... సరిగ్గా చదువుకోని విద్యార్థులు ఎక్కువ సమయం తీసుకుంటున్నారు. కొంతమంది పాఠాలు అర్థంచేసుకోలేక పోతుండడంతో ఉపాధ్యాయులు ఎక్కువసేపు వారితో ఉంటున్నారు. దీంతో సామాన్య, సాంఘిక, గణిత శాస్త్రాలను బోధిస్తున్నప్పుడు విద్యార్థులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతి కార్యక్రమంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు తరచూ నివేదికలు కోరుతుండడంతో ఉపాధ్యాయులు ఆయా అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తుండడంతో పదోతరగతి విద్యార్థుల బోధనపై తీవ్ర ప్రభావం పడుతోంది. మరో రెండు నెలల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఉన్నతిని రద్దుచేయాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

పదో తరగతిలోపే విజ్ఞానాన్ని పెంచేందుకు..

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థుల్లో 50 శాతం మంది ఉత్తీర్ణులు కావడం లేదు. ప్రత్యేక తరగతులు నిర్వహించినా ప్రయోజనం కనిపించడంలేదు. గత ఐదేళ్ల పదో తరగతి ఫలితాలను పరిశీలించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు..ఆరో తరగతి నుంచే విద్యార్థులకు చదువుపై ఆసక్తితో పాటు విజ్ఞానాన్ని పెంచేందుకు కొన్ని నెలల క్రితం 'ఉన్నతి' కార్యక్రమాన్ని ఈ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపె



ట్టారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విద్యార్థులతో ముందుగా చదివించడం, తర్వాత రాయించడం వంటివి మొదలు పెట్టారు. కొందరు బాగా నేర్చుకుంటుండగా... సగానికిపైగా పాఠాలు చదివేటప్పుడు తడబడుతున్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకూ ఇదే పరిస్థితి ఉండడంతో సిలబస్ పూర్తికావడంలేదు.

మార్పులు... చేర్పులతో ప్రయోజనం...

సర్కారు బడుల్లో చదువుతున్న ఆరో తరగతి విద్యార్థులు పదోతరగతికి వచ్చేసరికి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉండాలన్న లక్ష్యంతోనే ఉన్నతి కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని నిపుణులు అంటున్నారు. పాఠశాలల్లో స్థితిగతులను పరిశీలించకుండా ఒకేసారి దీన్ని ప్రారంభించారని.. అందుకే ఫలితాలు అనుకున్నంత రావడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరైన సంఖ్యలో లేకపోవడం, విద్యా వలంటీర్లను నియమించకపోవడం ప్రధాన లోపాలని వివరించారు. ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నట్టు 'ఉన్నతి'ని రద్దు చేయకుండా.. కార్యక్రమంలో మార్పులు చేర్పులు చేయడం..అన్ని ప్రభుత్వ పాఠశాలలను ఒకేగాటన కట్టకుండా... ప్రతి పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణించి సమస్యలు, ఇబ్బందులు గుర్తించిన తర్వాతే 'ఉన్నతి'ని అమలు చేయాలని సూచిస్తున్నారు.

## బాల్యం అమూల్యం.. బంగారు భవితనిద్దాం..!

వికారాబాద్ : పేదిరకంతో గ్రామాల్లో, వివిధ కారణాలతో పట్టణాల్లో బాలలకు సరైన ప్రోత్సాహం లేక భావి జీవితాన్ని కోల్పోతున్నారు. దీనికి తోడు ఇంటి నుంచి పారిపోయే బాలలు కొందరైతే, తల్లిదండ్రులు మందలించారన్న క్షణికావేశంతో కొందరు ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోతున్నారు. ఇలాంటి వారంతా ఏదో ఒక ఇటుక బట్టీ, హొటల్, తదితరాల్లో పనిచేస్తూ చదువుకు దూరమవుతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం వారిని స్వేచ్ఛ వైపు నడిపించటానికి అనేక చర్యలు తీసుకుంటోంది. ఏటా జనవరిలో 'ఆపరేషన్ స్మైల్' నిర్వహిస్తోంది. ఈ ఏడాదికి సంబంధించి జిల్లాలో కార్యాచరణ మొదలైంది. ఇదీ ప్రణాళిక..తప్పిపోయిన పిల్లలను గుర్తించి వారిని తిరిగి వారి తల్లిదండ్రులకు అప్పగించాలని సుప్రీంకోర్టు 2016లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్, జులై నెలలో ఆపరేషన్ ముస్కాన్‌ను నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఆపరేషన్ స్మైల్-9 కొనసాగింది. ప్రస్తుతం జరుగుతున్నది 10వ కార్యక్రమం.



ఆపరేషన్ స్మైల్‌పై డిసెంబర్ 28న జూమ్ మీటింగ్ ద్వారా రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులతో జిల్లా ఎస్పీ కోటిరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమ అమలుకు 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వలస బాల కార్మికులను గుర్తించటం, వెట్టి చాకిరి, భిక్షాటన లాంటి వాటిని నిర్మూలించడం, చిన్నారులను గుర్తించి వారిని రక్షణ గృహాలకు తరలించటం, చిన్నారులతో పనులు చేయిస్తే వారిపై తగు చర్యలు తీసుకోవటం చేయడం లక్ష్యంగా నిర్దేశించారు. తప్పిపోయిన బాల బాలికలను దర్పణ్ అప్లికేషన్ ద్వారా వెతుకుతారు. జనవరి నెలంతా కొనసాగే ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 60 మంది వరకు అధికారులు, సిబ్బంది భాగస్వాములు అవుతున్నారు. అందరి సహకారంతో మంచి ఫలితాలు- వెంకటేశం, ఛైర్మన్, బాలల సంక్షేమ కమిటీ, వికారాబాద్

జిల్లాలో అందరి సహకారంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. గుర్తించిన పిల్లలను బాలల సంక్షేమ కమిటీ ముందు ప్రవేశపెడుతున్నారు. పనిలో పెట్టుకున్న పిల్లల యజమానులకు కార్మిక, పోలీసు శాఖ ద్వారా చట్టప్రకారంగా చర్యలకు ఆదేశిస్తాం.

మూడు బృందాలను ఏర్పాటు చేశాం- ధనసిరి ప్రకాశ్, బాలల సంక్షేమ కమిటీ సభ్యుడు, వికారాబాద్ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించటానికి జిల్లాలో మూడు బృందాలను ఏర్పాటు చేశాం. వీరు పరిగి, తాండూరు, వికారాబాద్ డివిజన్‌లో తనిఖీలు నిర్వహిస్తారు. బాలల భవిష్యత్తును కాపాడటానికి అందరూ సహకరించాలి.

## పథకాలపై ఆశలు.. వీడని సందేహాలు



పెద్దపల్లి : ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న అభయహస్తం గ్రామ/వార్డు సభల్లో దరఖాస్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అయిదు సంక్షేమ పథకాలకు అర్హత సాధించేందుకు ప్రజలు ఆరాటపడుతున్నారు. వ్యవసాయ, ఇతర కూలీ పనులు పక్కనబెట్టి దరఖాస్తు చేసుకునేందుకు ఎగబడుతున్నారు. అయితే దరఖాస్తు పత్రాల్లో వివరాల నమోదుపై స్పష్టత కొరవడింది. ఆధార్ నవీకరణకు పాట్లు తప్పడం లేదు. గడువు సమీపిస్తున్న కొద్దీ సందేహాలు పెరుగుతున్నాయి. ఏ పథకానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలనే అంశంపై ఆందోళన నెలకొంది.

రోజుకు 64 గ్రామ సభలు జిల్లాలో 266 పంచాయతీలు, రామగుండం నగరపాలిక, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పురపాలికల పరిధిలో 114 వార్డులున్నాయి. జిల్లావ్యాప్తంగా 2,25,838 కుటుంబాల కోసం 1,830 కేంద్రాలను నెలకొల్పారు. గత నెల 28న గ్రామ/వార్డు సభలు ప్రారంభమయ్యాయి. ప్రతి రోజు 64 సభలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో గడిచిన అయిదు రోజుల్లో అయిదు పథకాలకు గ్రామీణ ప్రాంతాల్లో 1,16,331, పట్టణ ప్రాంతాల్లో 48,364 కలిపి మొత్తం 1,64,695 దరఖాస్తులు వచ్చాయి. వీటితో పాటు రేషన్ కార్డులు, భూ సంబంధిత, ఇతర సమస్యలపై 23,956 మంది అర్జీ పెట్టుకున్నారు.

స్పష్టత కరవు

అభయహస్తం సంక్షేమ పథకాల దరఖాస్తులకు సంబంధించి స్పష్టత లేక ఆందోళన చెందుతున్నారు.

ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవిస్తున్న వారు సొంతూళ్లకు వస్తున్నారు. వారి కుటుంబ సభ్యుల చేత కూడా దరఖాస్తులు పంపవచ్చని అధికారులు తెలిపినా సంతృప్తి చెందడం లేదు.

గృహజ్యోతి పథకం కింద 200లోపు యూనిట్ల విద్యుత్తు వాడకానికి బిల్లు రాయితీ.. పలువురికి అందని ద్రాక్షలా మారింది. చాలా మంది బిల్లులు చెల్లించకపోవడంతో కనెక్షన్ తొలగించారు. కొత్త కనెక్షన్ రాక పాత బిల్లు రసీదు లేక, రాయితీ కోల్పోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈయన పేరు గరిగంటి రాజయ్య. ఊరు సుల్తానాబాద్ మండలం సుద్దాల. మూడెకరాల భూమి ఉంది. ఇందులో ఒక ఎకరం సాగు చేస్తుండగా మరో రెండెకరాలు కౌలుకిచ్చారు. తనకు మూడెకరాల రైతుభరోసా సాయం ఇచ్చి కౌలు రైతుకు ఇచ్చినా అభ్యంతరం లేదని తెలిపారు.

'మాకు ఒకే రేషన్ కార్డు ఉంది. మా అత్తకు ఆసరా పింఛను వస్తోంది. నాకు కూడా పింఛను పొందేందుకు అర్హత ఉంది. ఒకే కార్డులో ఇద్దరికి పింఛన్ మంజూరు చేస్తారా?' అని పెద్దపల్లి మండలం కాసులపల్లికి చెందిన శివాల రాజమ్మ అడుగుతోంది. కమాన్‌పూర్‌కు చెందిన సుతారి సుధాకర్ అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. ప్రతి నెలా విద్యుత్తు బిల్లు చెల్లిస్తున్నారు. గృహజ్యోతి రాయితీ కోసం విద్యుత్తు మీటరు కనెక్షను కాలమ్ వద్ద ఏం రాయాలంటూ వాపోయారు.

## ఏడు పేపర్లు పదిలం..!

ఖమ్మం : మార్చిలో నిర్వహించే పదోతరగతి వార్షిక పరీక్షల్లో సామాన్యశాస్త్రం(సైన్స్) సబ్జెక్టును రెండు రోజులు నిర్వహించనున్నారు. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ వేర్వేరుగా ఉండనున్నాయి. ప్రతి పేపర్‌కు 50 మార్కులు ఉంటాయి. ఇప్పటి వరకు వీటిని ఒక్కరోజే నిర్వహించేవారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎప్పటి నుంచో చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వం ఎట్టకేలకు ఆమోదించింది. ఉత్తీర్ణతపై ప్రభావం...గతంలో రెండు పేపర్లు ఒకేరోజు నిర్వహించటం వల్ల చదవడం, రాయడంలో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. భౌతిక రసాయనశాస్త్రం, జీవశాస్త్రాలకు వేర్వేరుగా పాఠ్యపుస్తకాలు, వాటిని బోధించేందుకు ఇద్దరు నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారు. కానీ ఒకేరోజు పరీక్ష నిర్వహించటం వల్ల ఇద్దరు ఉపాధ్యాయులు చెప్పిన వేర్వేరు పాఠ్యపుస్తకాల్లోని అంశాలు కలగలిపి రాయాల్సి వచ్చేది. గతంలో అనేక మంది విద్యార్థులు గందరగోళానికి గురై ఉత్తీర్ణత శాతం తగ్గిన విషయం తెలిసిందే. ఈ పరీక్ష వేర్వేరుగా నిర్వహించాలనే డిమాండ్ నాలుగేళ్ల నుంచి వినిపిస్తోంది. వేర్వేరుగా నిర్వహించటం వల్ల...విద్యార్థులు తమ బలాలు, బలహీనతలు తెలుసుకుంటారు. ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో తెలుసుకునేందుకు విద్యార్థులకు, అది గమనించి సరి చేసేందుకు/రెమిడియల్ బోధన చేసేందుకు ఉపాధ్యాయులకు అవకాశం ఉంటుంది. గణితం, ఫిజికల్ సైన్స్‌లో భాగంగా ప్రతిభ చూపిన విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంజినీరింగ్ తదితర రంగాల కెరీర్‌ను ఎంచుకోవచ్చు. బయోలాజికల్ సైన్స్‌లో ప్రతిభ చూపితే బాటనీ, జువాలజీ, మెడికల్, పారామెడికల్, డెంటల్, వెటర్నరీ, అగ్రికల్చర్, ఫార్మసీ, నర్సింగ్ తదితర రంగాల్లో దూసుకెళ్లవచ్చు.

## వసతుల కొరత.. అన్నదాతకు వెత

తాండూరు : జిల్లాలో ఏళ్లుగా వ్యవసాయ విపణులున్నా అరకొర వసతులతోనే రైతులు నెట్టుకొస్తున్నారు. వీటిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. కనీసం ఇప్పుడైనా తమ అవస్థలను గుర్తించి మేలు చేయాలని రైతులు కోరుతున్నారు. దీనికి సంబంధించి కథనం. మొత్తం పది.. తాండూరుకు ప్రత్యేక శ్రేణి హోదా..: జిల్లాలో మొత్తం 10 విపణులుంటే, ప్రత్యేక శ్రేణి హోదాలో ఉన్న తాండూరు అతిపెద్ద వ్యవసాయ విపణిగా పేరుంది. వికారాబాద్ గ్రేడ్-1, పరిగి, మర్పల్లి గ్రేడు-2 విపణులు. బషీరాబాద్, ధారూర్, కోట్‌పల్లి, కొడంగల్, కుల్కచర్ల, నవాబుపేట విపణులు సహాయ కార్యదర్శి హోదాకు సంబంధించినవి.

విస్తరణకు 30 ఎకరాలు, రూ.10 కోట్లు

అతిపెద్దదిగా పేరున్న తాండూరు విపణిని విస్తరించడానికి ఏడాది కిందటే 30 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. భవనం నిర్మించడానికి రూ.10 కోట్లు కేటాయించింది. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం మూడెకరాల విస్తీర్ణంలో కొనసాగుతున్న విపణిలో ఇటు రైతులకు అటు వ్యాపారులకు నిత్యం ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఉత్పత్తులను నిల్వచేయడానికి సరిపోను షెడ్లు, ప్లాట్ ఫారాలు లేక రహదారులపైనే పనులు కానిస్తున్నారు. ఈ-నామ్ కార్యకలాపాలు అసౌకర్యాల మధ్యే కొనసాగుతున్నాయి.



ఉత్పత్తులను కుప్పలుగా పోయాల్సిన స్థానే బస్తాల్లో ఉంచి బీట్లను నిర్వహిస్తున్నారు.

వికారాబాద్‌లో ఈనామ్‌కు స్థలం ఎక్కడ

జిల్లా కేంద్రం వికారాబాద్ విపణిలో ఈ-నామ్ పద్ధతిలో వ్యవసాయ ఉత్పత్తులను కుప్పలుగా పోయడానికి సరి పోను స్థలం లేదు. కమిషన్ ఏజంట్ల దుకాణాలకు రైతులు తీసుకు వచ్చిన బస్తాల్లోనే లాట్ నెంబర్ల కేటాయింపు జరుగుతోంది. ఎక్కువగా వస్తున్న రైతులను దృష్టిలో పెట్టుకుని టాయిలెట్ బ్లాక్‌తో పాటు ఉత్పత్తుల నిల్వకు షెడ్డు నిర్మాణం చేపడుతున్నారు. కోట్‌పల్లి, బషీరాబాద్, కుల్కచర్ల, నవాబుపేట విపణుల్లో రైతులకు అవసరమైన ప్లాట్‌ఫారాలు, షెడ్లు పెద్దగా లేవు. ధారూర్, మర్పల్లి విపణుల్లో పరిమిత వసతులు ఉన్నాయి.

పరిగిలో విద్యుద్దీకరణకూ నోచలేదు

పరిగి విపణి 12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నప్పటికీ అసౌకర్యాలు ఎక్కువగా ఉన్నాయి. అంతర్గత రోడ్లు, ప్లాట్‌ఫారాలు సవ్యంగా లేవు. కనీసం విద్యుద్దీకరణ కూడా సవ్యంగా లేదు. ఉత్పత్తులను తూకం వేసేందుకు వే బ్రిడ్జి ఉన్నా వినియోగంలో లేదు.

ఆదాయ వనరులు ఇలా..

జిల్లాలోని విపణులకు విక్రయానికి వచ్చే ఉత్పత్తుల విలువలో ప్రతి రూ.100కు రూ.1శాతం చొప్పున ఆదాయంగా జమౌతుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం రూ.12.08 కోట్లుగా సమకూర్చు కోవాలని ప్రభుత్వం లక్ష్యాన్ని విధించింది. ఇప్పటి వరకు రూ.4.69 కోట్లు సమకూరాయి.

ప్రభుత్వానికి నివేదిస్తాం- సారంగపాణి, జిల్లా విపణుల అధికారి

జిల్లాలోని విపణుల్లో నెల కొన్న సమస్యలను పూర్తి స్థాయిలో తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిస్తాం. విపణిల్లో అందుబాటులో ఉన్న నిధులను బట్టి ఉన్నతాధికారుల సూచన మేరకు తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తాం.

## లక్షణాలు ఉన్నా.. పరీక్షలకు దూరం!

హైదరాబాద్: కరోనా లక్షణాలు ఉంటున్న చాలామంది టెస్టులకు దూరంగా ఉంటున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీంతో వారి నుంచి ఇంకొకరికి వైరస్ వేగంగా సోకుతోంది. ప్రస్తుతం గ్రేటర్ వ్యాప్తంగా కరోనా కేసులు నెమ్మదిగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం జేఎన్1 రకం కరోనాకు కారణమవుతోంది. జ్వరం, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, దగ్గులాంటి స్వల్ప లక్షణాలుండటంతో చాలామంది నిర్లక్ష్యంగా ఉంటున్నారు. టెస్టులు చేయించుకొని నిర్ధారణ అయితే ఐసోలేషన్‌లో ఉండాలని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు. గాంధీకి వచ్చే రోగుల్లో లక్షణాలు కనిపించిన వెంటనే టెస్టుల కోసం పంపుతున్నామన్నారు. ఆయన ఇంకా ఏం చెప్పారంటే...

వైరస్ ఒక్కొక్కరిపై ఒక్కోలా ప్రభావం చూపుతుంది. థర్డ్‌వేవ్‌లో స్వల్ప లక్షణాలుండటంతో ప్రస్తుతం కూడా చాలామంది టెస్టులకు దూరంగా ఉంటున్నారు. 2-3 రోజుల జ్వరం, గొంతు నొప్పి, దగ్గు, ముక్కు కారడం, ఒళ్లు నొప్పులుంటే నిర్లక్ష్యం చేయకుండా ర్యాపిడ్ లేదంటే ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయించుకోవాలి.

కరోనా నిర్ధారణ అయితే ఉచితంగా వైరల్ డ్రగ్స్ తీసుకోవాలి. గుంపుల్లో తిరగకుండా 3-5 రోజులు ప్రత్యేక గదిలో ఉండాలి. ఈ వేరియంట్‌తో ఎక్కువ మందిలో ఎలాంటి ఇబ్బంది లేకున్నా, వేగంగా వ్యాప్తి చెందుతోంది.

బీపీ, షుగర్, మధుమేహం, క్యాన్సర్, గుండె, మూత్రపిండాలు, కాలేయ వ్యాధులతో బాధపడుతున్న వారితోపాటు వృద్ధులు, గర్భిణులు, చంటిపిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పండుగల నేపథ్యంలో రద్దీగా ఉన్న బస్సులు, రైళ్లలో ప్రయాణించడంతో ఒకరి నుంచి ఒకరికి వైరస్ సోకుతుంది. వారికి వైరస్ సోకితే కొన్నిసార్లు ప్రమాదకరంగా మారే అవకాశముంది.

స్టెరాయిడ్లు, కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, అవయవ మార్పిడి తర్వాత మందులు తీసుకుంటున్న వారిలో వ్యాధి నిరోధకత తక్కువగా ఉంటుంది. ఇలాంటి వారు బయటకు వెళ్లేప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించాలి. గుంపులకు దూరంగా ఉండాలి. అత్యవసరమైతే తప్ప దూరపు ప్రయాణాలు మానుకోవడమే మంచిది.

కరోనా సోకిన తర్వాత ఇంట్లో చికిత్స తీసుకుంటున్నవారిలో జ్వరం తగ్గకపోయినా, ఆయాసం పెరిగి ఊపిరి తీసుకోవడం కష్టమైనా, ఆక్సిజన్ శాతం తగ్గుతుంటే.. నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

# సారపాక ఎన్నికలపై సందిగ్ధత

బూర్గంపాడు : బూర్గంపాడు మండలంలోని సారపాక పంచాయతీ ఎన్నికల విషయంలో సందిగ్ధత వీడటం లేదు. మున్సిపాలిటీగా మారుస్తారనే ప్రచారంతో 2019లో ఇక్కడ పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేదు. అనంతరం జరిగిన పురపాలిక ఎన్నికల్లోనూ సారపాక పేరు చేర్చలేదు. పరిషత్ ఎన్నికల్లోనూ పరిగణనలోకి తీసుకోలేదు. అప్పటి నుంచి ఏ ఎన్నికలకూ నోచక ఈ ప్రాంతం త్రిశంకు స్వర్గంలో ఉంది. సారపాకతోపాటు రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించని పంచాయతీల అంశంలో పలువురు హైకోర్టును ఆశ్రయించారు. తక్షణం ఏదో ఒక నిర్ణయం తీసుకుని ఎన్నికలు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. సారపాకను రెండు పంచాయతీలుగా విభజిస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీలో బిల్లును తీర్మానించి గవర్నర్ ఆమోదానికి పంపించినట్లు ప్రచారం సాగింది. దీనిపై స్పష్టత రాకపోవడంతో ఎన్నికల అంశం మళ్లీ మొదటికి వచ్చింది. ఏళ్లు గడుస్తున్నా ఎన్నికల విషయంలో స్థానికులకు ఎదురు చూపులు తప్పడం లేదు. పాలకవర్గం లేకపోవడంతో ఆశించినస్థాయిలో



అభివృద్ధి జరగడం లేదన్నది స్థానికుల వాదన.

అర్హతలున్నా..15 వేలకు పైచిలుకు జనాభా ఉండి పట్టణీకరణ వాతావరణం కలిగిన ప్రాంతాలను మున్సిపాలిటీలుగా ఉన్నతీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం సారపాక జనాభా 20 వేలు. ప్రస్తుతం ఇక్కడ 32 వేల మందికి పైగా నివసిస్తున్నారు. భద్రాద్రికి ముఖద్వారంగా సారపాకకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. గోదావరికి ఓవైపు సారపాక.. మరో వైపు భద్రాచలం జంట పట్టణాలుగా భాసిల్లుతున్నాయి. జనాభాతోపాటు అన్ని అర్హతలు ఉండటంతో సారపాకను మున్సిపాలిటీ చేయాలన్న డిమాండ్ తాజాగా ఊపందుకుంది.

# లక్ష్యం నెరవేరని తునికాకు సేకరణ

జనగామ : జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది అతి తక్కువగా 43 శాతం తునికాకు సేకరణ జరిగింది. మహదేవపూర్ అటవీ డివిజన్‌లో 42.78 శాతం, భూపాలపల్లి డివిజన్‌లో 43.02 శాతం వరకే తునికాకు సేకరణ చేపట్టారు. అటవీశాఖ అధికారులు నిర్ణయించిన లక్ష్యం మేరకు సేకరణ జరగకపోవడంతో కూలీలకు అనుకున్నంత ఆదాయం రాలేదు. కొన్ని యూనిట్లలో మే 1 నుంచి తునికాకు సేకరణ ప్రారంభించగా, మరికొన్ని యూనిట్లలో మే 5, 6 తేదీల్లో సేకరణ మొదలుపెట్టగా గత నెల 31న ముగిసింది.

ముందస్తుగా టెండర్లు నిర్వహించినా..

సేకరణ ప్రారంభమైన పది రోజుల్లోనే దాదాపు 40–50 శాతం తునికాకు కట్టలు కల్లాల వద్దకు చేర్చేవారు. ఈ ఏడాది ఆకు సేకరణ ముగిసినా.. ప్రభుత్వం ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేదు. లక్ష్యాన్ని అందుకోకపోవడంతో కూలీలు సేకరించిన తునికాకును ఇళ్ల వద్దనే ఆరబెడితే ఆ కట్టలను సంబంధిత గుత్తేదారులు కొనుగోలు చేసుకునే అవకాశాన్ని అటవీశాఖ అధికారులు కల్పించారు. ఈ సీజన్‌లో వందశాతం సేకరణ చేపట్టాలనే లక్ష్యంతో అటవీశాఖ ముందస్తుగా తునికాకు టెండర్లను పూర్తి చేసినా.. ఆశించిన ఫలితాలు రాలేదు. అడవుల్లో తునికాకు ఎక్కువగా లేకపోవటం, అటవీ గ్రామాల్లో ఉపాధి పనుల కారణంగానే ఆకు సేకరణ తగ్గిందని భావిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా రెండు అటవీ డివిజన్లలో మొత్తం 10 యూనిట్లలో ప్రభుత్వం 12,100 స్టాండర్డ్ బ్యాగులు(ఎస్‌బీ) లక్ష్యం నిర్దేశించగా, కేవలం 5,577 ఎస్‌బీలు సేకరించడంతో 43 శాతం నమోదైంది.



డివిజన్ల వారీగా తునికాకు సేకరణ వివరాలు పరిశీలిస్తే.. భూపాలపల్లి అటవీ డివిజన్‌లో మొత్తం 19 యూనిట్లు ఉండగా ఇందులో కేవలం నాలుగు యూనిట్లే అమ్ముడుపోయాయి. ఈ నాలుగు యూనిట్లలో 4,500 ఎస్‌బీల లక్ష్యం నిర్ణయించారు. ఈ డివిజన్‌లో 1,935 ఎస్‌బీలు సేకరించారు. మహదేవపూర్ డివిజన్‌లో 16 యూనిట్లు ఉండగా ఆరు యూనిట్లు అమ్ముడుపోగా, 7,600 ఎస్‌బీల లక్ష్యానికి గాను 3,642 ఎస్‌బీలు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఎండిన తునికాకు బస్తాలు 1,580 వరకు తునికాకు కల్లాల నుంచి గుత్తేదారులు గోదాంలకు తరలించారు. ప్రభుత్వం ఒక ఎస్‌బీ సేకరణకు రూ.3వేలు చెల్లిస్తోంది. ఈ లెక్కన కూలీలకు దాదాపుగా రూ.1.37 కోట్ల వరకు ఆదాయం లభించనుంది.

గుత్తేదారులు ముందుకు రాలేదు

– లావణ్య, డీఎఫ్‌వో, భూపాలపల్లి

అటవీ ప్రాంతంలో నాణ్యత గల ఆకు లేకపోవడంతో ఆశించిన మేరకు తునికాకు సేకరణ జరగలేదు. ఈసారి ఆన్‌లైన్‌లో టెండర్లు నిర్వహించటంతో గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో చాలా వరకు తునికాకు యూనిట్లు అమ్ముడు పోలేదు. లక్ష్యానికి మించి చేపట్టిన యూనిట్లలో తునికాకు కూలీలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తాం.

# ఏడేళ్లుగా అదే తీరు..!




ఖమ్మం :పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 2016 అక్టోబర్ 18న ఏడు కొత్త మండలాలను ఏర్పాటుచేసింది. పాత మండల కేంద్రాలకు ఆమడదూరంలో ఉంటూ అనేక సమస్యలకు నెలవైన ప్రాంతాలను అభివృద్ధిపరచాలనే సదుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. దాదాపు ఏడేళ్లు అవుతున్నా పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు తయారైంది. అద్దె భవనాల్లోనే అరకొర వసతుల నడుమ ప్రభుత్వ కార్యాలయాలు కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ప్రజలకు దూరభారం తగ్గించి మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతో ఖమ్మం జిల్లాలో రఘునాథపాలెం, భద్రాద్రి జిల్లాలో ఆళ్లపల్లి, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, కరకగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలాలు కొత్తగా ఏర్పాటయ్యాయి. ఒకట్రెండు మినహా మిగతా ప్రధాన శాఖల కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కాలం వెళ్లదీస్తున్నాయి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లో మరికొన్ని తాత్కాలికంగా సేవలు అందిస్తున్నాయి. అరకొర వసతులతో విధి నిర్వహణకు అధికారులు, సిబ్బంది, సేవలు పొందే క్రమంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా మండలాల వాసులు కోరుతున్నారు.

ఇదిగో సమస్యల చిట్టా.. రఘునాథపాలెంలో ఠాణా, తహసీల్ కార్యాలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రెండ్రోజుల్లో వీటిని ప్రారంభించనున్నారు. వ్యవసాయశాఖకు కొత్త భవనం మంజూరు కాలేదు. ఆళ్లపల్లిలో పశు వైద్యశాల భవనంలో తహసీల్ కార్యాలయం కొనసాగుతోంది. కొమ్ముగూడెం అంగన్‌వాడీ భవనంలో సెర్ప్ కార్యాలయం కొలువుదీరింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నా పూర్తిస్థాయిలో సేవలందటం లేదు. విద్యాశాఖ కార్యాలయాన్ని నిర్మించినా ప్రారంభానికి నోచుకోలేదు. కేజీబీవీ భవన నిర్మాణం పూర్తి కాలేదు. ఎంపీడీఓ, సెర్ప్, వ్యవసాయశాఖకు కొత్త భవనాలు మంజూరు కాలేదు. లక్ష్మీదేవిపల్లిలో అద్దె భవనంలో తహసీల్ కార్యాలయం కొలువుదీరింది. ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీఓ కార్యాలయం కొనసాగుతోంది. రామచంద్ర కళాశాల భవనంలో ఠాణా సేవలు అందుతున్నాయి. ఠాణా కొత్త భవన నిర్మాణం తుది దశకు చేరింది. విద్యాశాఖకు కొత్త భవనం మంజూరు కాలేదు. చుంచుపల్లిలో సింగరేణి భవనంలో తహసీల్ కార్యాలయం, జడ్పీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయం కొనసాగుతున్నాయి. ఠాణా భవన నిర్మాణం పూర్తికాలేదు. సుజాతనగర్ మండలంలో తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాలు ప్రభుత్వ పాఠశాల భవనంలోనే కొనసాగుతున్నాయి. ఠాణా భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. సెర్ప్, విద్య, వ్యవసాయ శాఖకు కొత్త భవనాలు మంజూరు కాలేదు. కరకగూడెంలో శిథిలావస్థకు చేరిన పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తహసీల్ కార్యాలయం కొనసాగుతోంది. ఎంపీడీఓ, వ్యవసాయశాఖ, సెర్ప్ కార్యాలయాలకు కొత్త భవనాలు మంజూరు కాలేదు. అన్నపురెడ్డిపల్లిలో ఠాణా, తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాలు సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ఆవరణలోని క్వార్టర్స్‌లో కొనసాగుతున్నాయి.

# అంగన్‌వాడీల్లో ఖాళీలు.. లబ్ధిదారులకు తిప్పలు



ఖమ్మం : గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణ.. పూర్వ ప్రాథమిక విద్యతో చిన్నారుల్లో మానసిక, శారీరక పరివర్తణే లక్ష్యంగా ప్రభుత్వం నడుపుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లావ్యాప్తంగా ఏడు ప్రాజెక్టుల పరిధిలో టీచర్లు, ఆయాల పోస్టులు వందల సంఖ్యలో ఖాళీగా ఉండటంతో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందని ద్రాక్షగా మారుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఖాళీల భర్తీ కోసం ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేసినా ఖమ్మం జిల్లాలో అధికార యంత్రాగం దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. నియామకాల కోసం ఇటీవల ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.మొత్తం 205 ఖాళీలు... జిల్లాలో ఖమ్మం అర్బన్, ఖమ్మం గ్రామీణం, కల్లూరు, కామేపల్లి, మధిర, సత్తుపల్లి, తిరుమలాయపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టుల పరిధిలో 1,605 ప్రధాన, 235 మినీ అంగన్‌వాడీ టీచర్లు, 1,605 సహాయకుల పోస్టులు ఉన్నాయి. ఏడాదిగా వాటిలో 205 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీచరు, ఆయా పోస్టులకు ఖాళీగా ఉన్న కేంద్రాలు తెరుచుకోవడం లేదు. సమీపంలో ఉన్న టీచర్లకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినా అంగన్‌వాడీ సేవలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందడం లేదు. ప్రభుత్వం అంగన్‌వాడీ సేవల్లో పారదర్శకతను పెంపొందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రత్యేకంగా ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రూపొందించి సేవల తీరును నిరంతరం పర్యవేక్షిస్తుంది. తద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహార పంపిణీ, పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలతో పాటు రికార్డుల నిర్వహణ, కేంద్రాల పనితీరు తదితర వివరాలను ఉన్నతాధికారులు విధిగా తెలుసుకునే వీలు కలుగుతోంది. సిబ్బంది వినియోగించే మొబైల్ ద్వారా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, సేవలకు మరింత ప్రాధాన్యం నెలకొంది. ఈ నేపథ్యంలో ఖాళీ పోస్టుల భర్తీపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఖాళీలు ఇలా..

ప్రధాన కేంద్రాల్లో టీచర్లు.. 63

మినీ కేంద్రాల్లో టీచర్లు.. 21

ఆయాలు.. 121

నేను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నా.. ఖాళీల వివరాలను పరిశీలిస్తాను. ఉన్నతాధికారులతో చర్చించి నియామకాలపై నిర్ణయం తీసుకుంటా.

జ్యోతి, డీడబ్ల్యూఓ

# ధ్రువీకరణ పత్రం.. బహుదూరం!

ఖమ్మం : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధన రవాణా, భారీ వాహనాల డ్రైవర్లకు శాపంగా మారింది. హెవీ వెహికిల్ లైసెన్స్ గడువు పూర్తయిన డ్రైవర్లు వాటిని పునరుద్ధరించుకోవాలంటే తప్పనిసరిగా సిరిసిల్ల వెళ్లాల్సి వస్తోంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్, ట్రైనింగ్ అండ్ రీసెర్చ్(ఐడీటీఆర్) కేంద్రం నుంచి ఒకరోజు శిక్షణ తీసుకున్నట్లు ధ్రువీకరణ పత్రం ఇక్కడి ఆర్టీఏలో సమర్పించాల్సి వస్తోంది. గత నెలలో రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేశారు. గతంలో మెడికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్తో పాటు తమ గడువు తీరిన లైసెన్సును సమర్పించి సులభంగా రెన్యూవల్ చేయించుకునేవారు. కొత్త నిబంధనతో ఖమ్మం నుంచి సిరిసిల్ల ఐడీటీఆర్‌కు వెళ్లి ధ్రువీకరణ పత్రం తీసుకొని రావడం డ్రైవర్లకు ఇబ్బందిగా మారింది.

ఖమ్మం టు సిరిసిల్ల...

జిల్లావ్యాప్తంగా హెవీ వెహికిల్ డ్రైవింగ్ లెసెన్సు కలిగిన డ్రైవర్లు సుమారు 10,000 ఉంటారని అంచనా. తమ డ్రైవింగ్ లెసెన్సు పునరుద్ధరణ(రెన్యూవల్)కు ఖమ్మం నుంచి సిరిసిల్ల ఐడీటీఆర్‌కు వెళ్లి రావడం వీరికి ఇబ్బందికరంగా మారుతోంది. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 మధ్యలోనే అక్కడికి చేరుకోవాల్సి ఉంది. ఆలస్యంగా వెళ్తే ఆ రోజు శిక్షణకు స్లాట్ కేటాయించరు. ఆరోజు అక్కడే గడిపి మరుసటి రోజు శిక్షణ పొందుతున్నారు. రూ.750 రుసుము చెల్లిస్తే డ్రైవింగ్‌లో శిక్షణ తరగతులు, డ్రైవింగ్ పరీక్ష నిర్వహించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తారు. మెడికల్, ఐడీటీఆర్ ధ్రువీకరణ పత్రం అప్‌లోడ్ చేసి మరుసటి రోజుకు ఖమ్మంలో రెన్యువల్ స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి వస్తోంది. తర్వాత జిల్లా రవాణా శాఖ అధికారులు ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేసి డ్రైవింగ్ పరీక్ష నిర్వహించి లైసెన్సు మంజూరు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు కనీసం మూడు రోజుల సమయం పడుతుందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు మానుకొని



తిరగాల్సి వస్తోందంటున్నారు.

ఖమ్మానికి ఐడీటీఆర్ వస్తే మేలు

రాష్ట్రంలోనే తొలిసారిగా ఐడీటీఆర్ కేంద్రం సిరిసిల్లలో ఏర్పాటు చేశారు. రెండోది ఖమ్మం జిల్లాకు మంజూరైంది. ఉత్తర్వులు వచ్చి రెండున్నరేళ్లు దాటినా కార్యరూపం దాల్చలేదు. నిధులు సైతం విడుదలయ్యాయి. స్థల సేకరణ ఇబ్బందిగా మారింది. ఖమ్మం జిల్లా కేంద్రంలో ఐడీటీఆర్ నిర్మాణం జరిగితే డ్రైవింగ్ శిక్షణతో పాటు ఈ సమస్యకు ఇబ్బందులు తొలగనున్నాయి. ప్రస్తుతానికి నిబంధనను మార్చాలని పలువురు హైకోర్టులో కేసు వేసినట్లు తెలుస్తోంది. తీర్పు తమకు అనుకూలంగా వస్తుందనే ధోరణితో కొందరు రెన్యువల్‌కు ఆసక్తి చూపడం లేదని సమాచారం.

లైసెన్స్ పునరుద్ధరణకు తప్పనిసరి

తోట కిషన్‌రావు, జిల్లా రవాణాశాఖాధికారి, ఖమ్మం

హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్సు పునరుద్ధరణకు తప్పనిసరిగా సిరిసిల్ల ఐడీటీఆర్ నుంచి ఒకరోజు శిక్షణ పొందినట్లు ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తు సమయంలో సమర్పించాల్సిందే. మెడికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్తో పాటు ఐడీటీఆర్‌లో శిక్షణ పత్రం తనిఖీ చేసి, డ్రైవింగ్ పరీక్ష నిర్వహించిన తర్వాతే డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్సులను జారీ చేస్తున్నాం.

# ముందుకు సాగని బడిబాట

జనగామ : జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చిన్నమడూరులోని బాలుర విద్యార్థి వసతిగృహంలో విద్యార్థులు లేకపోవడంతో త్వరలో దేవరుప్పుల వసతిగృహంలో విలీనం చేయాలనుకుంటున్నారు. ఈ పరిస్థితిలో ఆ హాస్టల్ వార్డెన్, సంబంధిత ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గ్రామాల్లో తిరిగితే మరింత మంది విద్యార్థులు వసతిగృహంలో చేరే అవకాశం ఉండేది.' ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో తగినంత మంది విద్యార్థులు ఉండడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరిగి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు వీలుగా ప్రభుత్వం బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నిరుటి వరకు ఈ సంప్రదాయం కొనసాగింది. ఈ క్రమంలో ఈ నెల 22 వరకు నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల కోసం జనగామ జిల్లాలో 17 మంది జడ్పీ ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 13 మంది వసతిగృహ సంక్షేమాధికారులను ప్రభుత్వం గ్రామాలకు



ప్రత్యేకాధికారులుగా నియమించింది. వీరు అసలు ఉద్యోగ ధర్మాన్ని వీడి ఇతర పనుల బాట పట్టారు. వీరు ఈ నెలంతా గ్రామాల్లో తిరిగి పిల్లలను బడిలో చేర్పించొచ్చు. అలాంటిది ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించడం సరికాదని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. 12న ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం

బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కలిసి వారి పిల్లలను తమ బడిలో చేర్పించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉంటే ఆ ప్రభావం వేరే విధంగా ఉంటుంది. మనఊరు మనబడి పథకంలో ప్రభుత్వం పలు ప్రాథమిక పాఠశాలల సుందరీకరణ, డిజిటల్ బోధన పేరిట ఉన్నత పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో తీర్చిదిద్దింది. బడులు తెరిచే నాటికి విద్యార్థులకు రెండు జతల దుస్తులు, రోగనిరోధక శక్తి పెంచే రాగి జావ అందించనున్నారు. ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు వీటి గురించి వివరిస్తూ తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్పించే అవకాశం ఉంటుంది. వీలు చూసుకొని వెళ్తున్నాం..ఇదే విషయాన్ని ఒకరిద్దరు ప్రధానోపాధ్యాయులతో ప్రస్తావిస్తే.. ప్రధానంగా మూడు కార్యక్రమాల్లో తమ అవసరం ఉంటుందన్నారు. రైతు వేదికల్లో నిర్వహించే రైతు దినోత్సవం, చెరువుల పండగ, విద్యా దినోత్సవం సందర్భంగా హడావుడి ఉంటుందన్నారు. ప్రత్యేకాధికారులుగా పనిచేస్తున్నా, వీలు చూసుకొని పాఠశాలకు వెళ్తున్నామని చెప్పారు.

# కుట్టుపై పట్టు

మెట్‌పల్లి : వేసవి సెలవులను బాలికలు సద్వినియోగం చేసుకుంటున్నారు. చదువుతో పాటు ఉపాధి అవకాశాలపై నైపుణ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో మగ్గం, ఎంబ్రాయిడరీలో ఇస్తున్న శిక్షణకు హాజరవుతూ మెలకువలు నేర్చుకుంటున్నారు. వివిధ రకాల డిజైన్లు నేర్చుకొని నైపుణ్యాలను మెరుగుపర్చుకుని అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని పట్టు సాధించేలా సాధన చేస్తున్నారు. వేసవి వచ్చిందంటే చాలు విద్యార్థులు సెలవులను ఆటపాటలతో గడిపేస్తారు. ఇంటి వద్ద ఖాళీగా ఉండలేక కొందరు తమ అభిరుచికి తగ్గట్టుగా వివిధ రంగాలపై దృష్టిసారిస్తారు. పలు సంస్థలు విద్యార్థుల కోసం క్రీడలు, కళలు ఇతర రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వస్తాయి. మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో 'ప్రయోగిల్లు' ఆధ్వర్యంలో బాలికలకు మగ్గం, ఎంబ్రాయిడరీపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందుకోసం అవసరమైన సామగ్రిని సమకూర్చారు. ఆసక్తి ఉన్న బాలికలు వీటిపై శిక్షణ పొందేందుకు ముందుకు వచ్చారు. గ్రామానికి చెందిన ఇద్దరు శిక్షకులు స్వచ్ఛందంగా బాలికలకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షకుల నుంచి మెలకువలు తెలుసుకుని సాధన చేశారు. వివిధ రకాల డిజైన్లు వేయడం నేర్చుకుని పట్టు సాధించారు. నెల రోజులుగా ఈ శిక్షణ కొనసాగుతోంది. వేసవి సెలవుల్లో తాము నేర్చుకున్న మగ్గం, ఎంబ్రాయిడరీ భవిష్యత్తులో తమకు ఎంతగానో ఉపయోగపడుతుందని శిక్షణ పొందుతున్న బాలికలు పేర్కొంటున్నారు.

డిజైన్లు నేర్చుకున్నాహరిణి, 9వ తరగతి



గ్రామంలో ప్రయోగిల్లు ఆధ్వర్యంలో మగ్గం, ఎంబ్రాయిడరీలపై శిక్షణ ఇచ్చారు. నెల రోజులుగా శిక్షణకు హాజరవుతున్నా. వివిధ రకాల డిజైన్లు వేయడం నేర్చుకున్నాను. సామగ్రి కూడా ప్రయోగిల్లు వారే అందించారు. గ్రామంలోని బాలికలకు ఇది మంచి అవకాశం. శిక్షకుల సాయంతో మెలకువలు తెలుసుకుని నైపుణ్యం సాధించేందుకు కృషి చేస్తున్నాను. ప్రయోగిల్లులో మంచి కార్యక్రమాలు చేపడుతున్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని మగ్గం, ఎంబ్రాయిడరీలను నేర్చుకోవడం ఆనందంగా ఉంది.

భవిష్యత్తుకు ఉపయోగపడేలాజాహ్నవి, పదో తరగతిప్రయోగిల్లులో అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సెలవుల్లో ఇంటి దగ్గర ఖాళీగా ఉండే కంటే శిక్షణకు హాజరవడం ఆనందంగా ఉంది. చదువుతో పాటు ఆటలు, స్పోకెన్ ఇంగ్లీష్, వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. వేసవిలో మగ్గం, ఎంబ్రాయిడరీ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడంతో అందులో చేరి నేర్చుకుంటున్నాను. నెల రోజులు గా శిక్షణ ఇచ్చారు. వివిధ డిజైన్లు వేయడంలో నైపుణ్యం సాధించాను. మగ్గం, ఎంబ్రాయిడరీ శిక్షణ తమకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుంది. మరింత మెరుగుపడేలా నిత్యం సాధన చేస్తున్నాను.




# జనవరి 7 నుంచి ఈసీ రాష్ట్రాల పర్యటన

దిల్లీ: మరికొద్ది నెలల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే వచ్చే వారం నుంచి దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఈసీ పర్యటనలు చేపట్టనుంది. తొలి విడతగా దక్షిణాది రాష్ట్రాల్లో సమావేశాలు నిర్వహించనుంది. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్‌తో కూడిన బృందం జనవరి 7 నుంచి రాష్ట్రాల్లో పర్యటించనుంది. తొలుత ఈసీ బృందం జనవరి 7 నుంచి 10వ తేదీ మధ్య.. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లనుందని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు దాదాపు అన్ని రాష్ట్రాల్లో పర్యటించి.. లోక్‌సభ ఎన్నికల సన్నాహాలను పర్యవేక్షించారు. ఈసీ బృందం రాష్ట్రాల పర్యటనకు ముందు.. వీరు ఎన్నికల సంఘానికి తమ నివేదికను ఇవ్వనున్నారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు ముందు ఈసీ రాష్ట్రాల్లో పర్యటించడం సాధారణంగా ప్రతిసారీ జరిగే అధికారిక ప్రక్రియనే. ఇందులో భాగంగా ఆయా రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలు, సీనియర్ పోలీసులు, పాలనా విభాగ అధికారులు, క్షేత్రస్థాయిలో ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందితో ఈసీ సమీక్షలు నిర్వహిస్తుంది. అయితే అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈసీ బృందం పర్యటించనుందా లేదా? అనే దానిపై స్పష్టత లేదు. ఇటీవలే ఎన్నికలు పూర్తయిన రాష్ట్రాల్లో పర్యటన ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఈసీ దేశవ్యాప్త పర్యటన పూర్తయిన అనంతరం.. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశముంది. 2019లో మార్చి 10వ తేదీన ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించగా.. ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు ఏడు దశల్లో పోలింగ్ నిర్వహించారు. మే 23న ఫలితాలను ప్రకటించారు. ఈసారి కూడా ఏప్రిల్-మే నెలల్లోనే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు కన్పిస్తున్నాయి.



# విజయవాడ ఎంపీ టికెట్ వేరే వ్యక్తికి..

విజయవాడ: రానున్న ఎన్నికల్లో విజయవాడ ఎంపీ టికెట్‌ను వేరే వ్యక్తికి ఇవ్వాలని తెదేపా నిర్ణయించింది. ప్రస్తుత ఎంపీ కేశినేని నానికి ఆ సమాచారాన్ని పార్టీ అధిష్ఠానం చేరవేసింది. ఈ విషయాన్ని ఆయన ఫేస్‌బుక్ ద్వారా వెల్లడించారు. పార్టీ అధినేత చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని శిరసావహిస్తానని తెలిపారు. "అందరికీ నమస్కారం. గురువారం సాయంత్రం చంద్రబాబు ఆదేశాల మేరకు మాజీ మంత్రి ఆలపాటి రాజా, ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ నన్ను కలిశారు. ఈనెల 7న తిరువూరులో జరిగే సభకు వేరే వారిని ఇన్‌ఛార్జ్‌గా నియమించినందున ఆ విషయంలో నన్ను కలగజేసుకోవద్దని చంద్రబాబు చెప్పినట్లు వారు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో విజయవాడ లోక్‌సభ అభ్యర్థిగా నా స్థానంలో వేరే వారికి అవకాశం ఇవ్వాలనుకుంటున్నారని.. పార్టీ వ్యవహారాల్లో ఎక్కువగా జోక్యం చేసుకోవద్దని చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. అధినేత ఆజ్ఞలను తు.చ. తప్పకుండా శిరసావహిస్తానని నేను వారికి హామీ ఇచ్చా" అని కేశినేని నాని పేర్కొన్నారు.



# ఉద్యోగుల ముట్టడి.. సమగ్ర శిక్ష పీడీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

విజయవాడ : విజయవాడ పటమటలోని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) కార్యాలయం ముట్టడి ఉద్రిక్తంగా మారింది. తమ 24 డిమాండ్లను పరిష్కరించాలంటూ రాష్ట్రం నలుమూలల నుంచి ఏపీ సమగ్ర శిక్ష (ఎస్ఎస్ఏ) కింద పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు విజయవాడకు తరలివచ్చారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు.. వచ్చిన వారిని వచ్చినట్టే అడ్డుకున్నారు. చుట్టుపక్కల దుకాణాలను సైతం మూసివేయించి ఎక్కడికక్కడ వారిని అరెస్టు చేశారు. కొందరిని ఠాణాలకు, మరికొంతమందిని ఆటోనగర్‌లోని ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ హాలుకు తరలించారు. గత నెల 20 నుంచి వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా.. ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. గోడు వెల్లబోసుకునేందుకు వచ్చిన తమను పోలీసులతో అణచివేతకు గురిచేస్తున్నారన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి, వారి సేవలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.



# వైజాగ్‌లో భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమం

## బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న భువనేశ్వరి

విశాఖపట్నం: విశాఖలో నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' కార్యక్రమం జరుగుతోంది. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో మనస్థాపంతో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శిస్తున్నారు. బాధిత కుటుంబాలకు ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ఆర్థిక సహాయం కూడా అందిస్తున్నారు. విశాఖ జిల్లాలో ఏడుగురు టీడీపీ కార్యకర్తలు చనిపోయారు. వారి కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. దక్షిణ నియోజకవర్గంలో ఇద్దరు, ఉత్తర నియోజకవర్గంలో ఇద్దరు, గాజువాకలో ముగ్గురు కార్యకర్తలు మృతి చెందారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వెంకటేశ్వర్ మెట్ల వద్ద ఒక బాధిత కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. విశాఖ సౌత్ నియోజకవర్గం, విశాఖ 33వ వార్డులో, జాగరపు చిన్న కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించారు. బాధిత కుటుంబాల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భువనేశ్వరి భరోసా ఇచ్చారు.




# షర్మిల చేరిక నేపథ్యంలో 'ఏపీ కాంగ్రెస్' ఆసక్తికర ట్వీట్.. ఒక ఫొటో షేర్ చేసి..

అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె, ఏపీ ప్రస్తుత సీఎం జగన్ మోహన్ రెడ్డి చెల్లెలు వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడం రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర విభజన ప్రభావంతో ఏపీలో స్తబ్దుగా మారిపోయిన హస్తం పార్టీకి ఆమె పునరుజ్జీవం పోయగలరా?. సొంత అన్నయ్య స్థాపించిన వైఎస్సార్‌సీపీ నుంచి కేడర్‌ను షర్మిల తిరిగి కాంగ్రెస్‌లోకి ఆకర్షించగలరా?, తండ్రి వైఎస్సార్ చెరిస్మాను ఆమె ఏవిధంగా ఉపయోగించుకోబోతున్నారు? అనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ 'ఎక్స్' వేదికగా ఆసక్తికర ట్వీట్ చేసింది. రాజశేఖర్ రెడ్డి చెరిష్మా క్రమక్రమంగా వైఎస్సార్‌సీపీకి దూరమవుతోందనే అర్థం వచ్చేలా ఏపీ కాంగ్రెస్ ఒక ఫొటోని షేర్ చేసింది. వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో రాజశేఖర్ రెడ్డి ఫొటో క్రమంగా కనుమరుగవుతున్న తీరుని ఈ ఫొటో ద్వారా తెలియజేసింది. 'మీకు అర్థమవుతోందా?' అనే ట్యాగ్‌ను ఏపీ కాంగ్రెస్ జోడించింది. ఇక ఫొటో మీద 'మొన్న.. నిన్న.. నేడు' అని ఉండగా మొదటి చిత్రంలో వైసీపీ ప్రచార లోగోలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫొటో సంపూర్ణంగా కనిపించింది. ఇక రెండవ చిత్రంలో సీఎం జగన్ ఫొటో వెనుకాల రాజశేఖర్ రెడ్డి కనిపించారు. చివరిదైన మూడో చిత్రంలో రాజశేఖర్ రెడ్డి ముఖం ఎక్కడా కానరాలేదు. ప్రచార చిత్రం మధ్యలో వైఎస్ జగన్ ఫొటో మాత్రమే కనిపించింది. షర్మిల కాంగ్రెస్‌లో చేరిక నేపథ్యంలో షేర్ చేసిన ఈ ఫొటో రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. షర్మిల రాకతో రాజశేఖర్ రెడ్డి పూర్తిగా కాంగ్రెస్ సొంతమని హస్తం పార్టీ చెప్పకనే చెప్పిందని విశ్లేషిస్తున్నారు. షర్మిల హస్తం పార్టీ గూటికి చేరడంతో ఆమెకు ఏపీసీసీ బాధ్యతలు అప్పగించనున్నారనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఇందుకు కాంగ్రెస్ అధిష్ఠానం సుముఖంగా ఉన్నట్టు విస్తృతంగా ప్రచారం సాగుతోంది. మరోవైపు షర్మిల చేరికతో పలువురు వైసీపీ నేతలు ఆమె వెంట వెళ్లే అవకాశం ఉందని, కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశాలున్నాయని జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే.




# జమిలి ఎన్నికలపై జానాభిప్రాయ సేకరణ

## 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'.. కేంద్రానికి మీ అభిప్రాయం ఇలా చెప్పండి..

న్యూఢిల్లీ, జనవరి 05: 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'.. అంశంపై ప్రజాభిప్రాయాన్ని కోరుతూ హైలెవల్ కమిటీ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న ఎన్నికల విధానంలో చేయాల్సిన మార్పులు, చేర్పులకు సంబంధించి సలహాలు, సూచనలు చేయాలని కోరింది. ఈ మేరకు జనవరి 15 లోగా తమ అభిప్రాయం తెలియజేయాల్సిందిగా ప్రజలను కోరింది. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' నిర్వహణ సాధ్యాసాధ్యాలపై తేల్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక హైలెవల్ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. ఈ కమిటీ తన నివేదికను త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి అందజేయనుంది. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణ విషయంలో ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ప్రకటన విడుదల చేసింది. ప్రజలు https://onoe.gov.in/onoe-reports ద్వారా గానీ, ఈ–మెయిల్ ఐడీ sc-hlc@gov.in ద్వారా గానీ, పత్రికా ప్రకటనలో పేర్కొన్న అడ్రస్‌కు పోస్ట్ చేయడం ద్వారా తమ అభిప్రాయలను తెలియజేయవచ్చునని ప్రకటనలో పేర్కొంది. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అంశం సాధ్యాసాధ్యాలను కేంద్రం గత కొంతకాలంగా పరిశీలిస్తోంది. విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్ర ముందుకెళ్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి మార్పు ఉండబోదని స్పష్టం చేస్తూనే.. 2029 ఎన్నికలను లోక్‌సభ, శాసనసభలతోపాటు కలిపి నిర్వహించాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఎనిమిది మంది సభ్యులతో గతేడాది సెప్టెంబర్ 2వ తేదీన హైలెవెల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ స్థానిక ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలను కలిపి నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. కాగా, ఒక దేశ ఎన్నికల కమిటీ మొదటి పూర్తి స్థాయి సమావేశం గతేడాది సెప్టెంబర్‌లో జరిగింది. ఎనిమిది మంది సభ్యులతో కూడిన కమిటీలో.. కాంగ్రెస్ లోక్‌సభ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి కూడా ఉన్నారు. అయితే, ఆయన ఈ కమిటీ నుండి వైదొలిగారు. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, గులాం నబీ ఆజాద్, హరీష్ సాల్వే, ఎన్‌కే సింగ్, డా. సుభాష్ కశ్యప్, సంజయ్ కొఠారి ఉన్నారు.

# కాంగ్రెస్‌లో షర్మిల చేరినంత మాత్రాన...




తిరుమల, జనవరి 5: తిరుమల శ్రీవారిని రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. ఎవరు ఏ పార్టీలో చేరినా తమకేమీ కాదన్నారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరినంత మాత్రాన ఆంధ్రప్రదేశ్‌లో ఏమీ కాదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు వల్లే కానిది ఎవరివల్ల అవుతుందని ప్రశ్నించారు. తమ పార్టీకి నష్టం ఏమి లేదని అన్నారు. టికెట్ల విషయములో ఎవరికి అసంతృప్తి లేదన్నారు. తమ పార్టీలో టికెట్లు ఎవరికి ఇచ్చుకుంటే చంద్రబాబుకు ఏం సంబంధమని మంత్రి మేరుగ నాగార్జున ప్రశ్నించారు.

# బాలినేనితో మాజీ మంత్రి , ఆయన కుమారుడు భేటీ..



ప్రకాశం :హైదరాబాద్‌లో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డితో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఆయన కుమారుడు సుధీర్ భేటీ అయ్యారు. ఒంగోలు అసెంబ్లీ నుంచి శిద్దా సుధీర్ పోటీ చెయ్యాలని జగన్ సూచించారు.

ఒంగోలు అసెంబ్లీ నుంచి పోటీ చేసే విషయంపై బాలినేనితో చర్చించేందుకు ఈ భేటీ జరిగింది. ప్రస్తుతం ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డి ఉన్నారు. గిద్దలూరుకి బాలినేని శ్రీనివాసరెడ్డిని పంపే యోచనలో జగన్ ఉన్నారు.

# జనవరి15న తిరుపతిలో గోదాదేవి కల్యాణం: టీటీడీ ఈఓ ధర్మా రెడ్డి



తిరుమల: తిరుమనలో జనవరి 25న రామకృష్ణ తీర్థ ముక్కోటి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ధర్మారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ధర్మ ప్రచారంలో భాగంగా మఠాధిపతులు, పిఠాధిపతులు సదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 60 నుంచి 70 మంది స్వామీజిలను సదస్సుకు ఆహ్వానిస్తామని ఈవో ధర్మారెడ్డి తెలిపారు. అన్నప్రసాదంలో వినియోగించే బియ్యాన్ని మిల్లర్లు ద్వారా కోనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. జనవరి15న తిరుపతిలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తాని చెప్పారు. 16న తిరుమలలో పార్వేటీ ఉత్సవం నిర్వహిస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అన్నారు. 2023 డిసెంబర్ నెలలో లక్షలాది మంది శ్రీవారిని దర్శనం చేసుకున్నారు. శ్రీవారి దర్శనం, లడ్డులా విక్రయాలు, తలనీలాలు సమర్పించిన భక్తుల వివరాలు.. దర్శనం:శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య.. 19.16 లక్షలు. హుండీ :హుండీ కానుకలు.. రూ.116.73 కోట్లు. లడ్డూలు : విక్రయించిన శ్రీవారి లడ్డూల సంఖ్య .. ఒక కోటి 46 వేలు. అన్నప్రసాదం : అన్నప్రసాదం స్వీకరించిన భక్తుల సంఖ్య .. 40.77 లక్షలు. కల్యాణకట్ట : తలనీలాలు సమర్పించిన భక్తుల సంఖ్య.. 6.87 లక్షలు.

## హీట్ పుట్టించిన కపూర్ సిస్టర్స్

కపూర్ సోదరీమణులు జాన్వీ- ఖుషీ ఇటీవల కాఫీ విత్ కరణ్ సీజన్ 8 తాజా ఎపిసోడ్ లో ప్రత్యక్షమయ్యారు. బాలీవుడ్‌లో అర్ధ దశాబ్దానికి పైగా అనుభవం ఉన్న అక్క జాన్వీ కపూర్ టాక్ షోలో ప్రత్యేక అతిథిగా మారగా, తన సోదరి ఖుషీ కపూర్ తో కలిసి చాలా సంగతులు చెప్పింది. యుక్తవయసులో కాఫీ విత్ కరణ్‌పై మక్కువతో ఈ వేదికపై కలిసి కనిపించాలని కలలు కనేవారమని సోదరీమణులు వెల్లడించారు. జాన్వీ కపూర్ ప్రతి సీజన్‌లో ఆత్మవిశ్వాసంతో పరిణతి చెందిన జవాబులు ఇస్తోంది. కపూర్ సిస్టర్స్ ఇద్దరూ తమ అభిరుచుల గురించి మాట్లాడారు. షో హోస్ట్ కరణ్ తో కలిసి జాన్వీ-ఖుషీ వేడెక్కించే ఫోటోషూట్ లో పాల్గొన్నారు. అలాగే కపూర్ సిస్టర్స్ స్పెషల్ ఫోటోషూట్ ఇప్పుడు అంతర్జాలాన్ని షేక్ చేస్తోంది. ముఖ్యంగా రెడ్ హాట్ డ్రెస్ లో జాన్వీ ఎంతో అందంగా కనిపించగా, క్రీమ్ కలర్ డిజైనర్ ఫ్రాకులో ఖుషీ ఎంతో ముద్దులొలికించింది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో వైరల్ గా మారాయి. కరణ్ షోలో సిస్టర్స్ చాలా విషయాలపై ఓపెనయ్యారు. చిన్ననాటి ఫన్నీ స్టోరీస్‌ని సిస్టర్స్ కరణ్ కి చెప్పారు. డేటింగ్ లైఫ్ గురించి ఓపెనయ్యారు. వారి తల్లి అతిలోక సుందరి శ్రీదేవి మరణంతో ఎంతగా కలత చెందారో కూడా వెల్లడించారు. జాన్వి తన కెరీర్ గురించి మాట్లాడుతూ... బాధలు కలతలతో ముందుకు సాగడంపైనా, తన జీవితంలో కొత్త దశ గురించి మాట్లాడింది. మరోవైపు ఖుషీ



చంచలంగా కనిపించింది. అయితే తన సినీఅరంగేట్రం, కలలు, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ ఆకర్షించింది. కపూర్ సోదరీమణులు ఖచ్చితంగా ఈ సీజన్‌లో అత్యంత ఆకర్షణీయమైన ఎపిసోడ్‌ను అందించారు. అలాగే కాఫీ విత్ కరణ్ 8లో లైట్ హార్ట్ టాపిక్‌లతో హృదయాలను గెలుచుకున్నారు. కాఫీ విత్ కరణ్ తాజా ఎపిసోడ్ లో తన తల్లి శ్రీదేవి మరణం గురించి విన్నప్పుడు, తన మనసులో ఏం జరిగిందో వెల్లడిస్తూ జాన్వీ ఎంతో ఉద్వేగానికి గురైంది. అక్క జాన్వీని ఖుషీ వోదార్చింది. ఖుషీ గుండె ధైర్యం ఉన్న అమ్మాయి అని కూడా జాన్వీ అంది. నాటి ఆ క్షణాన్ని మళ్లీ గుర్తు చేసుకుంటూ.. షో హోస్ట్ కరణ్ జోహార్‌తో జాన్వీ కపూర్ ఇలా చెప్పింది, నాకు కాల్ వచ్చినప్పుడు నా గదిలో ఉన్నాను. ఖుషీ గది నుండి ఏడుపు వినిపించింది. నేను తన గదిలోకి ప్రవేశించాను.. తనను లాగి ఏడ్చేశాను.. కానీ నాకు ఇంకా గుర్తుంది. ఖుషి నా వైపు చూసింది.. నా వైపు చూసిన నిమిషం తన ఏడుపు ఆగిపోయింది.. నా పక్కన కూర్చుని నన్ను ఓదార్చుడం ప్రారంభించింది. అప్పటి నుండి తను దాని గురించి ఏడవడం నేను ఎప్పుడూ చూడలేదు! అని కూడా తెలిపింది. నేను ఎల్లప్పుడూ బలంగా ఉన్నానని భావిస్తున్నాను కాబట్టి నేను ప్రతి ఒక్కరికీ ఓదార్పునివ్వాలనుకుంటాను అని ఖుషీ తెలిపింది. తన భర్త బోనీ కపూర్ మేనల్లుడు అర్జున్ మార్వా వివాహానికి హాజరైన శ్రీదేవి 2018లో దుబాయ్‌లో మరణించారు. ఆమె మృతికి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోవడమే కారణమని అధికారులు ప్రకటించారు. బోనీకపూర్- శ్రీదేవి దంపతులకు జాన్వీ, ఖుషీ కూతుళు . దీనికి ముందు బోనీ మోనా శౌరీని వివాహం చేసుకున్నాడు. ఈ జంటకు కుమారుడు అర్జున్ కపూర్- కుమార్తె అన్షులా కపూర్ ఉన్నారు. అన్షులా మినహా బోనీ పిల్లలందరూ ఇప్పుడు తారలు అయ్యారు. జాన్వీ 2018లో ధడక్‌తో తెరకు పరిచయమైంది ఖుషీని జోయా అక్తర్ గత సంవత్సరం ది ఆర్చీస్‌తో చిత్ర పరిశ్రమలోకి ప్రవేశపెట్టారు. అర్జున్ కపూర్ మొదటి సినిమా ఇషాక్‌జాదే. ఇటీవలే బోనీ స్వయంగా రణ్‌బీర్ కపూర్ - శ్రద్ధా కపూర్‌లతో కలిసి నటించిన తు ఝూటీ మైన్ మక్కార్‌తో తన నటనను ప్రారంభించాడు.

## స్టైలిష్ అందాల రకుల్ అదుర్స్

టాలీవుడ్ లో ఒకానొక సమయంలో స్టార్ హీరోయిన్ గా, అత్యధిక పారితోషికం తీసుకున్న హీరోయిన్ గా నిలిచిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. తక్కువ సమయంలో టాలీవుడ్ లో స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కించుకున్న ఈ అమ్మడు అంతే స్పీడ్ గా కెరీర్ లో డౌన్ ఫాల్ మొదలయ్యింది. తెలుగు లో ఆఫర్లు తగ్గుతున్న సమయంలో బాలీవుడ్ లో ఈ అమ్మడు ప్రయత్నాలు చేసింది. ఆ ప్రయత్నాలు సఫలం అయ్యాయి. అయితే అక్కడ కూడా ఎక్కువ కాలం రకుల్ ప్రీత్ సింగ్ స్టార్ డమ్ ను కొనసాగించలేక పోయింది. వరుసగా రకుల్ నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడ్డాయి. నటిగా ఈ అమ్మడు నిరాశ పరిచినా కూడా సోషల్ మీడియా ద్వారా మాత్రం అందంతో ఎప్పుడు కూడా ఫ్యాన్స్ ని మరియు



ప్రేక్షకులను నిరాశ పరచలేదు. అందమైన ఫోటోలను రెగ్యులర్ గా సోషల్ మీడియా ద్వారా షేర్ చేయడం ద్వారా సినిమాలు చేయకున్నా కూడా పాపులారిటీని సొంతం చేసుకుంది. హీరోయిన్ గా రకుల్ ప్రీత్ సినిమాలు మరింత తగ్గాయి. అయితే ఇలాంటి స్టైలిష్ ఔట్ ఫిట్ మరియు ఆకట్టుకునే ఫోటో షూట్స్ కారణంగా వార్తల్లో నిలుస్తూనే ఉంది. తాజాగా ఈ అమ్మడు సోషల్ మీడియా ద్వారా షేర్ చేసిన ఈ ఫోటోలు ఆమె మళ్లీ సినిమాల్లో బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి అనిపిస్తోందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మోడ్రన్, స్టైలిష్ లుక్ లో రకుల్ ప్రీత్ సింగ్ అందం అదుర్స్ అన్నట్లుగా ఉంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేస్తున్న రకుల్ ప్రీత్ సింగ్ సినిమాల్లో మళ్లీ బిజీ అయ్యేనా చూడాలి.




## 'గుంటూరు కారం'.. ఆ సీక్వెన్స్ మామూలుగా ఉండవట



మహేష్ బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'గుంటూరు కారం' మూవీ ఈ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా కోసం మహేష్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ తో సినిమాపై విపరీతమైన హైప్ పెంచేశారు మేకర్స్. ముఖ్యంగా ఇటీవల రిలీజైన 'కుర్చీ మడతపెట్టి' మాస్ సాంగ్ సినిమాపై అంచనాలను పీక్స్ కి తీసుకెళ్లింది.

ఈ పాటలో మహేష్, శ్రీలీలా ఊర మాస్ స్టెప్పులకు అందరూ ఫిదా అయిపోయారు. గతంలో ఎన్నడు లేనంతగా మహేష్ ఈ సినిమాలో మాస్ డాన్స్ తో అదరగొట్టేసారు. దీంతో ఈసారి థియేటర్స్ లో సంక్రాంతి సందడి మొత్తం 'గుంటూరు కారం' తోనే ఉండబోతుందని అర్థం అయిపోయింది.

మరోవైపు రిలీజ్ కి ముందే సినిమాకు సంబంధించి బ్యాక్ టు బ్యాక్ అప్డేట్స్ లీక్ అవుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. తాజాగా ఈ సినిమాకి సంబంధించి మరో ఇంట్రస్టింగ్ అప్డేట్ బయటకు వచ్చింది. అదేంటంటే.. ఈ సినిమా సెకండాఫ్ లో ... మహేష్ బాబు, శ్రీలీల కలిసి గుంటూరు మిర్చి గిడ్డంగి లో.. చేసే రచ్చ మామూలుగా ఉండదట. అక్కడ వీళ్లిద్దరూ కలిసి 'ఒక్కడు' సినిమాలోని చెప్పవే చిరుగాలి పాటతో 'నెక్కిలీసు గొలుసు' సాంగ్ కి చేసే రచ్చ మాములుగా ఉండదట. ఈ మధ్యకాలంలో యూట్యూబ్ లో బాగా ఫేమస్ అయిన 'నాది నెక్కిలేసు గొలుసు' సాంగ్ కి మహేష్, శ్రీలీలా కలిసి మాస్ స్టెప్పులు వేస్తే థియేటర్స్ అంతా దద్దరిల్లిపోవాల్సిందే. ప్రస్తుతం ఈ అప్డేట్ తో మహేష్ ఫ్యాన్స్ ఖుషి అవుతున్నారు. సినిమాని ఎప్పుడెప్పుడు థియేటర్స్ లో చూద్దామని ఆత్రుతగా ఉన్నారు. అతడు', 'ఖలేజా' తర్వాత మహేశ్‌బాబు - త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తోన్న సినిమా ఇది. ఇందులో మహేష్ పక్కా ఊర మాస్ క్యారెక్టర్ లో కనిపించబోతున్నాడు మహేష్ కి జోడిగా శ్రీలీల, మీనాక్షి చౌదరి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. సీనియర్ హీరో జగపతి బాబు, జయరాం, ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ, ఈశ్వరీ రావు, రఘుబాబు, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తున్నారు. జనవరి 12 న విడుదల కాబోతున్న ఈ సినిమా ట్రైలర్ ని ఈ నెల 8 న రిలీజ్ చేయబోతున్నట్లు తెలుస్తోంది.

## సైంధవ్ సెన్సార్ కంప్లీట్.. ఎలా ఉంటుందంటే..



టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేశ్.. ఈ సంక్రాంతికి సైంధవ్ సినిమా తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. హిట్ ఫేమ్ శైలేశ్ కొలను దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. ఇటీవలే కలియుగ పాండవులు టు సైంధవ్ పేరిట హైదరాబాద్ లో ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన టీజర్, మూడు పాటలు సినీప్రియులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. సినిమాపై భారీ అంచనాలు పెంచేశాయి. తాజాగా మూవీ యూనిట్ అదిరిపోయే అప్డేట్ ఇచ్చింది. థియేట్రికల్ రిలీజ్ కు అన్ని లైన్లు క్లియర్ అయినట్లు ప్రకటించింది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ %ఖ/ూ% సర్టిఫికెట్ జారీ చేసినట్లు వెల్లడించింది. సంక్రాంతి కానుకగా ఈ మూవీ జనవరి 13వ తేదీన విడుదల కానుంది.

**స్టోరీ లైన్ ఇదే..** ఈ మూవీలో వెంకటేశ్ కూతురు అరుదైన వ్యాధితో బాధపడుతుందంట. దీంతో ప్రతి తండ్రిలాగే వెంకీ కూడా అనేక కష్టాలు ఎదుర్కొంటారు. కుమార్తె వైద్యం కోసం రూ.17 కోట్లు విలువ చేసే ఇంజక్షన్ అవసరం ఉంటుంది. ఆ ఇంజక్షన్ విలన్ కు కూడా కావాల్సి ఉంటుంది. దాని కోసం ఇద్దరి మధ్య పోరాటం జరుగుతుందంట. తన కూతురితో కలిసి ఒంటరిగా ఉంటున్న వెంకటేశ్ కు సహాయం చేసేందుకు శ్రద్ధా శ్రీనాథ్ వస్తోందట. మరి చివరికి ఏం జరిగింది.. అదే సినిమా. నిహారిక ఎంటర్టైనమెంట్స్ బ్యానర్ పై వెంకట్ బోయినపల్లి ఈ సినిమా నిర్మిస్తున్నారు. కిషోర్ తాళ్లూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సంతోశ్ నారాయన్ సంగీతమందిస్తున్నారు. చంద్రప్రస్థ ఫిక్షనల్ పోర్ట్ ఏరియా బ్యాక్ డ్రాప్ లో సాగే సీక్రెట్ మిషన్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. నవాజుద్దీన్ సిద్దిఖీ ఈ మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. తమిళ్ హీరో ఆర్య కీలక పాత్రలో నటిస్తున్నారు. వెంకటేశ్ గత కొన్నేళ్ల నుంచి సినిమా సినిమాకు ఎక్కువ గ్యాపే తీసుకుంటున్నారు. గురు మూవీ ఫ్లాప్ తర్వాత చాలా నెలలకు ఎఫ్-2 చేశారు. ఆ సినిమా సూపర్ హిట్ అయినా గ్యాప్ తీసుకుని నారప్ప చేశారు. ఆ తర్వాత ఎఫ్-3 నటించినా సక్సెస్ అందుకోలేకపోయారు. ఈ సినిమాలేవీ వెంకీ మార్కెట్ ను పెంచలేకపోయాయి. అయితే సైంధవ్ మూవీతో మాత్రం వెంకటేశ్ మార్కెట్ పెరుగుతుందని అంతా భావిస్తున్నారు. దానికి తగ్గట్లుగానే ప్రమోషన్స్ చేస్తున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## రీమేక్ హక్కులు చేతిలో ఉంటే ఇన్ని లాభాలా?

మాస్ మహారాజా రవితేజ.. మాస్ యాక్షన్ హీరోల డైరెక్టర్ హరీష్ శంకర్ కలయికలో గతంలో మిరపకాయ్ - షాక్ లాంటి సినిమాలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత చాలా కాలానికి ఇప్పుడు మరోసారి ఇదే కాంబినేషన్ రిపీటవుతోంది. రవితేజ -హరీష్ శంకర్ మూడవసారి ఓ రీమేక్ కోసం పని చేస్తున్నారు. మిస్టర్ బచ్చన్ అనే టైటిల్ ని ఇప్పటికే ప్రకటించగా అభిమానుల నుంచి అద్భుత స్పందన వచ్చింది. ఈ మూవీ గురించి కొన్ని ఆసక్తికర విషయాలు తెలిసాయి. ఇది హిందీ సినిమా 'రైడ్'కి రీమేక్. ఏషియన్ సునీల్ రైడ్ రీమేక్ హక్కులను చాలా కాలం క్రితమే సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వాళ్లు వారి నుంచి మిస్టర్ బచ్చన్ రీమేక్



హక్కులను 2 కోట్లకు కొనుగోలు చేశారు. ఇంత మొత్తం చెల్లించడమే గాక.. ఆసియా సునీల్‌తో 20 శాతం లాభాలను పంచుకుంటారు. రవితేజ-హరీష్ శంకర్‌ల కాంబోను పరిశీలిస్తే మిస్టర్ బచ్చన్ మేకర్స్‌కు చక్కని లాభం చేకూరుస్తుందని అంచనా. రీమేక్ హక్కులు దగ్గర ఉంచుకున్నందున ఏషియన్ సునీల్ రూ. 4 కోట్లు సునాయాసంగా రాబట్టనున్నాడు. రీమేక్ సినిమా తీయకుండానే సునీల్ భారీ మొత్తాన్ని జేబులో వేసుకుంటున్నాడు. వేసవిలోపు షూటింగ్ పూర్తి అవుతుంది. హరీష్ ఈ సినిమాని చక్కని మార్కెటింగ్ పాయింట్ ఆఫ్ వ్యూలో తెరకెక్కించేందుకు చాలా కసరత్తు చేసాడని తెలిసింది. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తో ఉస్తాద్ భగత్ సింగ్ సెట్స్ కెళ్లాల్సి ఉన్నా అది ఆలస్యమైంది. ఎన్నికల కోడ్ వచ్చేస్తున్నందున పవన్ పూర్తిగా రాజకీయాలపై దృష్టి సారించిన సంగతి తెలిసిందే. ఈలోగా హరీష్ శంకర్ రవితేజతో మిస్టర్ బచ్చన్ ని పూర్తి చేస్తారు.

## తెలుగమ్మాయి హోలీవుడ్ అవతార్

తెలుగు అమ్మాయిలు టాలీవుడ్ లో ఎక్కువగా హీరోయిన్స్ గా నటించడం లేదు. తెలుగు అమ్మాయిలు ముంబై ముద్దుగుమ్మలతో పోల్చితే అందాల ఆరబోత విషయంలో కాస్త వెనుక ఉంటారు అనే అభిప్రాయం ఉండేది. అందుకే పర భాష ముద్దుగుమ్మలను టాలీవుడ్ ఫిల్మ్ స్టార్స్ తెచ్చుకున్నారు. ముంబై ముద్దుగుమ్మలకు ఏమాత్రం తగ్గకుండా తెలుగు అమ్మాయిలు కూడా ఈ మధ్య కాలంలో చాలా అందంగా, అంతకు మించి అన్నట్లుగా ఫోటో షూట్స్ చేస్తున్నారు. స్కిన్ షో విషయంలో హద్దులు పెట్టుకుని చాలా మంది తెలుగు అమ్మాయిలు చాలా అందంగా కనిపిస్తూ ఫోటో షూట్స్ చేస్తున్న దాఖలాలు ఉన్నాయి. తెలుగు అమ్మాయిలు అనగానే చాలా మందికి



తేజస్వి మడివాడ నే గుర్తుకు వస్తుంది. ఆమె సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. ఆ సినిమాలో చేసిన సందడి కారణంగా అందరి దృష్టిని ఆకర్షించిన విషయం తెల్సిందే. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా ముంబై ముద్దుగుమ్మలకు పోటీ అన్నట్లుగా తేజస్వి ఫోటో షూట్స్ ను షేర్ చేస్తూ ఉంటుంది. ఈసారి హోలీవుడ్ అందం అంటూ అభిమానులు మరియు నెటిజన్స్ కామెంట్స్ చేసే విధంగా తేజస్వి మడివాడ అందంగా కనిపిస్తోంది. ఇంత అందం కు టాలీవుడ్ లో సరైన గుర్తింపు, ఆధరణ దక్కలేదు అనేది ఆమె ఫ్యాన్స్ అభిప్రాయం.



## యూపీఎస్సీ ఛైర్మన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

ఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండో రోజు ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా యూపీఎస్సీ ఛైర్మన్ మనోజ్ సోనీతో సమావేశమయ్యారు. రేవంత్ వెంట మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎస్ శాంతికుమారితో పాటు ఇద్దరు ఐఏఎస్‌లు అధికారులు ఉన్నారు. యూపీఎస్సీ తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పకడ్బందీగా తీర్చిదిద్ది, ప్రశ్నపత్రాల లీకేజీలు లేకుండా చేస్తామని సీఎం ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనపై యూపీఎస్సీ ఛైర్మన్‌తో చర్చిస్తున్నట్లు సమాచారం. పరీక్షల నిర్వహణలో యూపీఎస్సీ అవలంబిస్తున్న విధానాలను తెలుసుకుంటున్నారు.




## బండి సంజయ్, సునీల్ బన్సాల్‌కు కీలక బాధ్యతలు

న్యూఢిల్లీ: లోక్ సభ ఎన్నికలకు ప్రధాన పార్టీలు సన్నద్ధం అవుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'భారత్ జోడో న్యాయ' అనే మరో యాత్రకు సిద్ధం అవుతున్నారు.

తామేం తక్కువ కాదని అంటోంది అధికార భారతీయ జనతా పార్టీ. పార్టీ అంతర్గత కమిటీలను ప్రక్షాళన చేసింది. పలువురికి కీలక బాధ్యతలను అప్పగించింది. తెలంగాణ బీజేపీ మాజీ చీఫ్ బండి సంజయ్‌కు పెద్ద బాధ్యతను అప్పగించింది.

**సీట్లు మాత్రం తగ్గొద్దు :** గత వారం బీజేపీ ఆఫీస్ బేరర్లతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశం అయ్యారు. ఆ సమావేశంలో వచ్చే ఎన్నికల కోసం చేపట్టే కార్యక్రమాల గురించి చర్చించారు. బీజేపీలో వివిధ మోర్చాలకు కొత్త వారిని నియమించారు. కొత్త వారు వెంటనే బాధ్యతలు చేపడుతారని ప్రకటించారు. ప్రధాని మోదీ ఆదేశాలతో ఆ సమావేశం జరిగిందని తెలిసింది. వచ్చే ఎన్నికల్లో సీట్ల సంఖ్య ఏమాత్రం తగ్గొద్దని మోడీ ధిశానిర్దేశం చేశారని.. అందుకే వెంటనే మోర్చా అధిపతులను మార్చారని సమాచారం.

**బండి భుజనా కీలక బాధ్యత :** తెలంగాణ బీజేపీ మాజీ చీఫ్ బండి సంజయ్‌కు కీలక బాధ్యతలను హై కమాండ్ అప్పగించింది. కిసాన్ మోర్చా ఇంచార్జీ బాధ్యతలను కట్టబెట్టింది. బీజేపీలో కీలకమైన వింగ్‌కు ఇకపై బండి సంజయ్ నేతృత్వం వహిస్తారు. తెలంగాణలో బీజేపీ ఊపు రావడానికి ఆయనే కారణం. అందుకే కీలక బాధ్యతలు ఇచ్చింది. సునీల్ బన్సాల్‌కు యువ మోర్చా ఇంచార్జీగా నియమించింది. బైజయంత్ జే పాండాకు మహిళా మోర్చా బాధ్యతలు, తరుణ్ చుగ్‌కు ఎస్సీ మోర్చా బాధ్యతలు, రాధా మోహన్ దాస్ అగర్వాల్‌కు ఎస్టీ మోర్చా, వినోద్ తావ్డేకు ఓబీసీ మోర్చా, దుష్యంత్ కుమార్ గౌతమ్‌కు మైనార్టీ మోర్చా బాధ్యతలను కట్టబెట్టింది.

**ఓటు బ్యాంక్ పెంచడమే లక్ష్యం..? :** వచ్చే ఎన్నికల్లో పార్టీ బలోపేతం కోసం బీజేపీ మోర్చా పదవులను కీలక నేతలకు అప్పగించింది. ఆ వింగ్స్ పటిష్టం చేసే బాధ్యత వీరిపై ఉంది. ఎటొచ్చి బీజేపీ ఓటు బ్యాంక్ పెంచడమే వీరి లక్ష్యంగా నిర్దేశించారు. హైకమాండ్ ఆదేశాలతో ఆ పనిలో నేతలు నిమగ్నం అయ్యారు.

## పనిలేకే 420 బుక్‌లెట్‌తో బద్నామ్.. బీఆర్‌ఎస్‌పై వీహెచ్ ఫైర్



హైదరాబాద్, జనవరి 5: బీఆర్ఎస్ నేతలకు పనిలేక 420 బుక్ లెట్‌తో కాంగ్రెస్ పార్టీని బద్నామ్ చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపెంచారన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ ఎన్ని హామీలు నెరవేర్చారో ప్రజలకు చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవరుస్తుందని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు భయం పట్టుకుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన దళితులకు ముడు ఎకరాల భూమి ఇంటికో ఉద్యోగ హామీలు నెరవేర్చలేకపోయారని విమర్శించారు. సోనియా గాంధీ ఖమ్మంలో పోటీ చేస్తే ఆ ప్రభావం అన్ని నియోజకవర్గాల్లో ఉంటుందన్నారు. రాష్ట్రంలో సోనియా గాంధీ, కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అన్ని నియోజకవర్గాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో సోనియా గాంధీని అత్యధిక మెజారిటో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి ప్రధానిని చేసి ఇండియా కూటమిని గెలిపిస్తామని వీహెచ్ స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ గుర్తింపు రద్దు చేయలన్న కాంగ్రెస్ ఫిర్యాదుపై మాజీమంత్రి ఆగ్రహం

సూర్యాపేట, జనవరి 5: బీఆర్ఎస్ పార్టీ గుర్తింపు రద్దు చేయాలన్న కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుపై మాజీమంత్రి జగదీష్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఇచ్చిన హామీలు గుది బండలయ్యాయని కాంగ్రెస్ పార్టీకి భయం మొదలైందన్నారు.

ప్రభుత్వం నడపలేని అయోమయంలో బీఆర్ఎస్ పార్టీ గుర్తింపు రద్దు చేయాలని పిచ్చిపిచ్చి ఉత్తరాలు రాస్తున్నారన్నారు. అధీకారంలోకి వచ్చేది నమ్మకం లేక ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చారని ముందే చెప్పామన్నారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తింపు రద్దు చేయడం కాదు హామీలు అమలు చేయకపోతే ప్రజలు కాంగ్రెస్‌ను రద్దు చేస్తారని హెచ్చరించారు. 200 యూనిట్లు ఉచితమని ముక్కుపిండి బిల్లులు వసూలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తింపు రద్దు చేయడం ఎవ్వరి వల్ల సాధ్యం కాదని జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు.



## తెలంగాణలో రాజకుటుంబీకుల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి

ఢిల్లీ: కర్ణాటక,తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మాజీ శాసన సభ్యులు గోనె ప్రకాశరావు పేర్కొన్నారు. త్వరలో సోనియాగాంధీని కలుస్తానన్నారు. రాజకుటుంబీకుల ఆస్తులు రెండు రాష్టాల్లో ఉన్నాయన్నారు. రాజ కుటుంబీకులు చనిపోయి వారి వారసులు మైనర్‌లు అయినప్పుడు వారి ఆస్తులు ప్రభుత్వ ఆధీనంలోకి వస్తాయన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయన్నారు. కొంత మంది ప్రైవేటు వ్యక్తులు అన్యాయంగా ఆక్రమించుకున్నారన్నారు. బ్రిటీష్ కాలం నాటి కోర్ట్ ఆఫ్ ఆర్డర్ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని గోనె ప్రకాశరావు పేర్కొన్నారు. "కొన్ని లక్షల కోట్ల రూపాయల ఆస్తులను తెలంగాణ, కర్నాటక ప్రభుత్వాలు ఆధీనంలోకీ తెచ్చుకోవాలి. రాజ కుటుంబీకుల వారసులు ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నప్పుడు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం వారి ఆస్తులు రిలీజ్ చెయ్యాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ప్రైవేటు వ్యక్తులు లక్షల కోట్ల ఆస్తులను దోచుకునే అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి చిచ్చర పిడుగు. ఆయన మంచి పాలన అందిస్తున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణలో ఉన్న రాజకుటుంబీకుల ఆస్తులను ప్రైవేటు వ్యక్తుల కబంధ హస్తాల నుంచి స్వాధీనం చేసుకోవాలి. క్లెయిమ్ చెయ్యని రాజకుటుంబీకుల ఆస్తులను స్వాధీనం చేసుకుంటే రాష్ట్రప్రభుత్వానికి ఆర్థిక కష్టాలు తీరే అవకాశం ఉంది. కోర్టు ఆఫ్ ఆర్డర్ ఆస్తులను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే ఆర్థికంగా లాభదాయకం. రాజకుటుంబీకుల ఆస్తుల డాక్యుమెంట్లను మాయం చేసి ప్రైవేటు వ్యక్తులు వారి ఆస్తులను కొట్టేశారు. లంగాణ, కర్నాటక ప్రభుత్వాలు సానుకూలంగా స్పందిస్తే వారికి సహాయం చెయ్యడానికి కొంత మంది రాజకుటుంబీకులు సిద్ధంగా ఉన్నారు. కు రేవంత్ రెడ్డి సమయం ఇస్తే అన్ని వివరాలను నేను ఆయనకు చెబుతాను.రాజకుటుంబీకుల ఆస్తులను ప్రైవేటు వ్యక్తుల నుంచి విడిపిస్తే దానికి ప్రతిఫలంగా వారు రాష్ట్రప్రభుత్వ పథకాలకు తమ వంతు ఆర్థిక సహాయం చేస్తారు" అని గోనె ప్రకాశరావు పేర్కొన్నారు.




హైదరాబాద్ : కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కుమార్తె జీవితాన్ని నాశనం చేశాడు.. తల్లికి చెప్పినా ఫలితం లేకపోవడంతో అతడి బారినుంచి తప్పించుకునేందుకు వేసిన అడుగులు కూడా మరింత ప్రమాదంలో పడ్డేశాయి.. రైలులో పరిచయమైన ఓ యువకుడితో ప్రేమాయణం సాగినా.. ఉపాధి ఆశతో వెళ్లి మరో యువకుడి చేతిలో మోసపోయింది.. ఈ దారుణం జీడిమెట్ల ఠాణా పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ ఎం.పవన్ తెలిపిన వివరాల మేరకు.. బీహార్‌కు చెందిన ఓ కుటుంబం వలస వచ్చి కుత్బుల్లాపూర్ విలేజ్‌లో నివాసముంటున్నారు. వారికి ముగ్గురు పిల్లలు. కుమార్తె(18) తొమ్మిదో తరగతి వరకు చదువుకుంది. కుటుంబీకులు కరోనా కారణంగా చదువు మాన్పించడంతో ఇంటి వద్దే ఉంటోంది. కొంతకాలంగా తండ్రి లైంగికంగా వేధించడం ప్రారంభించాడు. పలుమార్లు అత్యాచారం చేశాడు. ఎవరికీ చెప్పొద్దంటూ భయపెట్టాడు. యువతి ఈ విషయం తల్లికి చెప్పగా.. తండ్రిపై లేనిపోనివి చెప్పొదంటూ కట్టడి చేసింది. గతేడాది దీపావళికి వీరు బీహర్ నుంచి నగరానికి రైలులో వచ్చిన సమయంలో అదే రాష్ట్రానికి చెందిన యువకుడు సంతోష్ పరిచయమయ్యాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇద్దరు చాట్ చేసుకున్నారు. అతడు బడంగ్‌పేట గాంధీనగర్‌లో ఉంటున్నట్లు చెప్పాడు. పరిచయం పెరిగి ఇద్దరూ ప్రేమించుకున్నారు. గత నెల 26న సంతోష్ కలవాలని కోరడంతో యువతి సికింద్రాబాద్ వెళ్లింది. ఇద్దరు కలిసి ఎన్టీఆర్ గార్డెన్, ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో తిరిగారు. తరువాత అతడు కుత్బుల్లాపూర్‌లో ఆమె ఇంటి వద్ద వదిలి వెళ్లిపోయాడు. చెప్పకుండా బయటకు వెళ్లినందుకు కొడతారనే భయంతో ఆమె తిరిగి సికింద్రాబాద్ స్టేషన్‌కి పారిపోయింది. అక్కడ రవి అనే వ్యక్తి ఫోన్ తీసుకొని సంతోష్‌కు ఫోన్‌చేసింది. అతని తన ఇంటికి రావాలన్నాడు. రవి సాయంతో అక్కడికి వెళ్లింది. మరుసటిరోజు మీ ఇంటికి వెళ్లాలని ప్రేమికుడు చెప్పాడు. వెంట వచ్చిన రవిని తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరడంతో అతడు సరేనంటూ అమీన్‌పూర్‌లోని తన గదికి తీసుకెళ్లాడు. రెండురోజులు అక్కడేఉంది. 29న మద్యం మత్తులో రవి ఆమెపై లైంగిక దాడి చేశాడు. మరుసటిరోజు కుటుంబీకులకు ఫోన్‌చేసి సికింద్రాబాద్ స్టేషన్ రావాలని చెప్పింది. వారు రావడంతో జరిగిన విషయం వివరించింది. జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై జరిగిన అన్ని దారుణాలను వారికి వివరించింది. యువతి తండ్రితో పాటు రవి అనే వ్యక్తిపై అత్యాచారం కేసు నమోదుచేసినట్లు పోలీసులు చెప్పారు.




## ఎర్రసముద్రంలో ఆగని హౌతీల దాడులు

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికా సహా 12 దేశాలు చేసిన హెచ్చరికలను హౌతీ రెబల్స్ బేఖాతరు చేశారు. ఎర్రసముద్రంలో ఉద్రిక్తతలను మరింత పెంచే దుందుడుకు చర్యలకు పాల్పడ్డారు. పేలుడు పదార్థాలతో కూడిన ఓ డ్రోన్ బోట్‌ను పేల్చివేశారు. ఈ ఘటనలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు. ఎర్రసముద్రంలో సరకు రవాణా నౌకలపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హౌతీ రెబల్స్‌కు అమెరికా సహా 12 దేశాలు బుధవారమే హెచ్చరికలు జారీ చేశాయి. ఈ అక్రమ దాడులకు వెంటనే ముగింపు పలకాలని సూచించాయి. చట్ట విరుద్ధంగా నౌకలను ఆదుపులోకి తీసుకోవడాన్నీ ఆపాలని పేర్కొన్నాయి. ఈ మేరకు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశాయి. ఈ ప్రకటనపై బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, జపాన్ తదితర దేశాలు సంతకాలు చేశాయి. ఇది జరిగిన ఒక రోజు వ్యవధిలోనే హౌతీలు మరో దాడికి పాల్పడటం గమనార్హం. సముద్రంలో దాదాపు 80 కిలోమీటర్ల లోపలికి చొచ్చుకెళ్లి.. నౌకల రవాణాతో రద్దీగా ఉండే ప్రాంతంలో గురువారం డ్రోన్ బోట్ పేలిపోయిందని పశ్చిమాసియాలో అమెరికా నావికాదళాలకు నేతృత్వం వహిస్తున్న వైస్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ తెలిపారు. ఆ సమయంలో కొన్ని మైళ్ల దూరంలో వాణిజ్య, అమెరికా నేవీకి చెందిన నౌకలు ఉన్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు హౌతీలు ఎర్రసముద్రంలో 25 దాడులకు పాల్పడ్డట్లు కూపర్ వెల్లడించారు. దీంతో నౌకలకు రక్షణగా గత నెల అమెరికా సహా మరికొన్ని దేశాలు కలిసి ఆపరేషన్ 'ప్రాస్పెరిటీ గార్డియన్' చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం దీంట్లో 22 దేశాలు భాగస్వామ్యమైనట్లు తెలిపారు. రెండు క్రూజ్ క్షిపణులు, ఆరు 'యాంటీ-షిప్ బాలిస్టిక్ క్షిపణులు', 11 డ్రోన్లను కూల్చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతానికైతే యెమెన్‌లోని హౌతీ స్థావరాలపై దాడి చేసే ఉద్దేశం లేదని చెప్పారు. ఆపరేషన్ ప్రాస్పెరిటీ కేవలం రక్షణాత్మక చర్యల కోసమే ఏర్పాటైందని వివరించారు. మరోవైపు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో అమెరికా ప్రతినిధి మాట్లాడుతూ.. ఎర్రసముద్రంలో హౌతీల దాడులు తీవ్ర దశకు చేరుకున్నట్లు తాము భావిస్తున్నామని తెలిపారు. యెమెన్‌లో అత్యధిక భూభాగంపై పట్టున్న హౌతీలు 2023 నవంబర్ 19 నుంచి ఎర్ర సముద్రంలో దాడులకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యను నిరసిస్తూ వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీంతో పలు నౌకలు తమ మార్గాలను మార్చుకున్నాయి. ఫలితంగా రవాణా ఖర్చులు భారమవుతున్నాయి.




## ఇరాన్‌లో జంట పేలుళ్లు మా పనే.. ఉగ్రసంస్థ ఐఎస్ ప్రకటన

టెహ్రాన్: ఇరాన్‌లో జంట పేలుళ్లకు ఒడిగట్టింది తామేనని ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ ప్రకటించింది. టెలిగ్రాం ఛానెళ్ల ద్వారా ఈ విషయాన్ని వెల్లడించింది. పేలుళ్లకు పాల్పడిన ఇద్దరు వ్యక్తుల పేర్లు (ఒమర్-అల్ మువాహిద్, సేఫుల్లా అల్-ముజాహిద్), ఫొటోలనూ తమ వార్తాపత్రిక అమఖ్ ద్వారా బహిర్గతం చేసింది. వారు ఇరాన్‌కు చెందినవారా? లేక విదేశీయులా? అనేది తెలియరాలేదు. పేలుళ్లను ఆత్మాహుతి దాడులుగా ఐఎస్ తెలిపింది. ఇరాన్ జనరల్ ఖాసిం సులేమానీ సమాధి వద్ద నివాళులర్పించేందుకు బుధవారం భారీగా తరలివచ్చిన జన సమూహంలోకి చొచ్చుకెళ్లి.. శరీరానికి చుట్టుకున్న బాంబులను వారు ఎలా పేల్చుకున్నారో వివరించింది. గతంలోనూ సామాన్య పౌరులు, భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్‌లో ఐఎస్ దాడులకు తెగబడింది. జనరల్ ఖాసిం సులేమానీ ఈ ఉగ్ర సంస్థపై పోరాడుతూ వచ్చారు. 2020లో అమెరికా దాడిలో ఆయన మృతి చెందడాన్ని స్వాగతిస్తూ ఈ ముష్కర మూక అప్పట్లో ప్రకటన విడుదల చేయడం గమనార్హం. కెర్మన్‌లో సులేమానీ సమాధివద్ద నివాళులర్పించేందుకు తరలివచ్చిన జన సమూహాన్నే లక్ష్యంగా చేసుకొని పాల్పడ్డ ఈ పేలుళ్లలో 84 మంది మృతిచెందారు. తొలుత 103 మరణించినట్లు వెల్లడించినప్పటికీ.. తర్వాత ప్రభుత్వ వర్గాలు రెండు దఫాల్లో ఆ సంఖ్యను కుదించాయి. ఘటనా స్థలం కెర్మన్.. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు 820 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఈ పేలుళ్లు జరగడం అనేక అనుమానాలకు తావిచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్‌ను నిందిస్తూ ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ పొలిటికల్ డిప్యూటీగా ఉన్న మొహమ్మద్ జంషీదీ ఓ ప్రకటన చేశారు. దీన్ని అమెరికా ఖండించింది. ఈ పేలుళ్లలో ఇజ్రాయెల్ హస్తం ఉన్న సూచనలూ కనపడటం లేదని తెలిపింది.

## పేదల జోలికొస్తే తాట తీస్తాం.. 'దానం' అనుచరులను వెంటనే అరెస్టు చేయాలి..

హైదరాబాద్ : బేగంపేటలోని ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో పేదల ఇళ్లు అన్యాయంగా కూల్చి కబ్జాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరులపై కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డా. కె. నారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో భూకబ్జాదారులు పేదల ఇళ్లు కూల్చిన ప్రాంతాన్ని రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఈ.టి నరసింహ, జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, సనత్‌నగర్ నియోజకవర్గం కార్యదర్శి ఎండి సలీం ఖాన్‌లతో కలిసి సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. కూల్చివేసిన ఇళ్లు తిరిగి నిర్మించుకోవడానికి ప్రభుత్వం సహాయం అందించాలన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తానని బస్తీ వాసులకు హామి ఇచ్చారు. దానం నాగేందర్ అనుచరులు తిరిగి పేదల జోలికొస్తే తాట తీస్తామని ఈ సందర్భంగా నారాయణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఇంతియాజ్ ఖాన్, సైఫ్‌ఖాన్, జావీద్, వెంకటేష్, దశరధ్ తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

**నిజ నిర్ధారణ కమిటీ పర్యటన...** బేగంపేట ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ పేదల ఇళ్లను నాయకులు బెదిరించి ఖాళీ చేయిస్తున్నారని జనవరి 2న బస్తీ వాసులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ విషయం మీడియాలో రావడంతో అసలు విషయం తెలుసుకునేందుకు ఈనెల 3వ తేదిన మానవ హక్కుల వేదిక హైదరాబాద్ యూనిట్ బృందం ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లోని ఇళ్లు కూల్చిన ప్రాంతాన్ని మానవ హక్కుల వేదిక హైదరాబాద్ యూనిట్ ఉపాధ్యక్షులు బిలాల్, ప్రధాన కార్యదర్శి సంజీవ్‌తో కూడిన బృందం నిజ నిర్ధారణ జరిపింది. జిల్లా కలెక్టర్ విచారణ జరిపి ఆ బస్తీ వాసులకు చట్టరిత్యా నివాస హక్కులు కల్పించాలని కమిటీ డిమాండ్ చేసింది. బస్తీ వాసులకు రౌడీల నుంచి పోలీస్ కమీషనర్ పూర్తి రక్షణ కల్పించాలని, ఎమ్మెల్యే దానం నాగేందర్ పాత్రపై ప్రభుత్వం విచారణకు ఆదేశించాలని నిజనిర్ధారణ కమిటీ డిమాండ్ చేసింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com